

హవ్వ.. ఎన్ని అబద్ధాలు!



హంద్రీ నీవా కాలువ వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించిన సీఎం జగన్

కుప్పం, ఫిబ్రవరి 26: కుప్పానికి మొత్తం తానే చేశానంటూ సీఎం జగన్ సోమవారం గుండిశెట్టిపల్లె సభలో యథాప్రకారం దబాయించి అబద్ధాలు వల్లించారు. ఒక మారుమూల విసిరేసినట్టుగా ఉండే కుప్పాన్ని తన నియోజక వర్గంగా ఎన్నుకుని సుదీర్ఘకాలంగా నారా చంద్రబాబు నాయుడు చేసిన అభివృద్ధిని చూసిన జనం జగన్ మాటలకు విస్తుపోయారు. జగన్ మాటలనూ, నిజాలనూ ఇక్కడ ఇస్తున్నాం.

జగన్: 'హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలను కుప్పానికి తెచ్చింది నేనే'

నిజం: హంద్రీ-నీవా జలాలను తెలుగుదేశం హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు సుమారు రూ.500 కోట్లు వ్యయం చేసి పలమనేరు నియోజకవర్గం వి.కోట మండలం కృష్ణాపురం దాకా తీసుకొచ్చారు. ఇక్కడి నుంచి జగన్ నీళ్ల వదిలి ప్రారంభోత్సవం చేసిన ప్రాంతానికి దూరం 20 కిలోమీటర్లు మాత్రమే. ఈ 20కిలోమీటర్లు నీళ్ల తీసుకురావడానికి జగన్‌కు ఐదేళ్లు పట్టింది. సరిగ్గా ఎన్నికలకు ముందు మాత్రమే హడావుడిగా ఈ పని కూడా చేశారు. కొస మెరుపు ఏమిటంటే.. ప్రారంభోత్సవ సమయంలో నీళ్లు కనిపించడం కోసం, కట్టకట్టి నీటిని ఆపి వదిలారు. రాజుపేటలో జగన్ వదిలిన నీళ్లు.. ఆయన ప్రసంగించిన సభ జరిపిన గుండిశెట్టిపల్లె దాకా కూడా చేరుకోలేదు. అయినా నీళ్లు పొలాలను తడిపితే తప్ప జనానికి మేలు చేసినట్టు కాదు.

జగన్: 'కుప్పంను మున్సిపాలిటీ చేసింది నేనే'

నిజం: మున్సిపాలిటీగా మారింది జగన్ ప్రభుత్వంలోనే అయినా అంతకు ముందు జరిగిన కసరత్తు కీలకమైనది. కుప్పంతోపాటు పరిసర ప్రాంతాల్లోని 8 పంచాయతీలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి, రూర్బన్ పథకం కింద రూ.100 కోట్లను కేంద్ర సాయంతో చంద్రబాబు తీసుకొచ్చారు. మున్సిపాలిటీగా మారితే ఈ నిధులు వెనక్కి వెళ్తాయనే ఉద్దేశ్యంతో, పంచాయతీలను కొనసాగించారు. రూర్బన్ నిధులతో రక్షిత మంచినీటి ట్యాంకులు, రోడ్లు తదితర అభివృద్ధి పనులు చాలా జరిగాయి. మున్సిపాలిటీ అయ్యాక జరిగిన అభివృద్ధి ఏమిటో, తాము కేటాయించామని చెబుతున్న రూ.66 కోట్లతో ఏయే పనులు ఎక్కడెక్కడ చేశారో వైసీపీ నేతలు చెప్పలేకపోతున్నారు.

జగన్: 'కుప్పంను రెవెన్యూ డివిజన్ చేసింది నేనే'

నిజం: వైసీపీ ప్రభుత్వంలోనే కుప్పం రెవెన్యూ డివిజన్‌గా మారింది. అయితే ఇందువల్ల జనానికి జరిగిన మేలు ఏమిటో ఎవరూ చెప్పలేకపోతున్నారు. కుప్పానికి 8 కిలోమీటర్ల దూరంలో చంద్రబాబు కట్టించిన న్యాక్ భవనంలోని ఓ గదిలో ఆర్డీవో కార్యాలయం మొక్కుబడిగా కొనసాగుతోంది. కనీసం ఆర్డీవో పేరు కూడా నియోజకవర్గంలో సగం మందికి తెలీదు.

జగన్: 'పోలీసు సబ్ డివిజన్ చేసింది నేనే'

నిజం: ప్రకటించి ఏళ్లు గడిచినా, డీఎస్పీని నియమించింది మాత్రం ఇటీవలే. నియోజకవర్గంలో ఉన్నది నాలుగు మండలాలు. ఇద్దరు సీఐలు ఉన్నారు. ఇప్పుడు కొత్తగా ఎన్నికలకు ముందు డీఎస్పీ వచ్చారు. అంతే తేడా.

హాజరుకాని ఆ ముగ్గురు ఎమ్మెల్యేలు

చిత్తూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్లను పొందలేకపోయిన ముగ్గురు ఎమ్మెల్యేలు సోమవారం నాటి శాంతిపురం సీఎం జగన్ సభలో కనిపించలేదు. చిత్తూరు, పూతలపట్టు, సత్యవేడు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్ బాబు, ఆదిమూలంను కాదని సీఎం జగన్ ఆమధ్య విజయానంద రెడ్డి, సునీల్‌కుమార్, రాజేష్‌ను కొత్త ఇన్‌చార్జులుగా ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఎమ్మెల్యేలు అన్నిరకాల ప్రభుత్వ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఎలాంటి ప్రొటోకాల్ లేకుండానే కొత్త ఇన్‌చార్జులు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అధికారులు కూడా వారికి స్వాగతం పలికి వారి సేవలో నిమగ్నమవుతున్నారు. శాంతిపురంలో సోమవారం జరిగిన సీఎం సభా వేదికమీద చిత్తూరు, పూతలపట్టు కొత్త ఇన్‌చార్జులు హడావిడి చేశారు. ఎమ్మెల్యేల తరహాలో వారికి మొదటి వరుసలో స్థానం దక్కింది.



జనానికి కష్టం

సీఎం జగన్ మాట్లాడుతుండగానే ఖాళీగా దర్శనమిస్తున్న గ్యాలరీలు

కుప్పం/శాంతిపురం/రామకుప్పం: సీఎం జగన్ పర్యటన జనానికి కష్టాలు తెచ్చిపెట్టాయి. సోమవారం ఉదయం నుంచి సభ జరుగనున్న శాంతిపురం వద్ద ట్రాఫిక్ మళ్లించారు. బడగుమాకుల పల్లె, విజలాపురం, రామకుప్పం మీదుగా వి.కోట వద్ద ట్రాఫిక్‌ను కలిపారు. ఈ మధ్యలో జాతీయ రహదారి పొడవునా బ్యారికేడ్లు పెట్టి స్థానికులను ఇబ్బందులకు గురిచేశారు. క, ఎమ్మెల్సీ భరత్ ప్రసంగం మొదలు పెట్టగానే జనం వెనుదిరగడం మొదలుపెట్టారు. సీఎం జగన్ ప్రసంగం మొదలు పెట్టాక ఒక్కరొక్కరే బయటకు నడిచారు. 'యాడికి పతా వుండావు అప్పుడే?' అని ఒక మహిళ అంటే, 'అయ్యో, రావే పోదాం, ఇక్కడేముండాది, నామొగం' అని పక్కనున్న మహిళను సభా ప్రాంగణం నుంచి వేరొక మహిళ ఈడ్చుకుపోవడం కనిపించింది. ఇలా వెళ్తున్న వారి సంఖ్య క్రమేణా పెరగడంతో పోలీసులు రోడ్డుమీద బారికేడ్లు అడ్డుపెట్టి నిలువరించడానికి ప్రయత్నించారు. కాసేపు చూసిన జనం, ఆ తర్వాత వారిని తోసుకుని మరీ బయటకు వెళ్లారు. సీఎం ప్రసంగం ముగిసేసరికి సభలో చాలావరకు ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. ఇక, సీఎం ప్రసంగం అరగంటలో ముగుస్తుందనగా పోలీసులు కుప్పం-పలమనేరు రహదారిలో రాకపోకల్ని అడ్డుకున్నారు. చాలాసేపు ఎండలో ఉండాల్సి రావడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒక్కసారిగా బారికేడ్లను తోసుకుంటూ ముందుకు వచ్చారు. పోలీసులు వారిని నిలువరించే ప్రయత్నంలో కొందరు కిందపడ్డారు. ఈ క్రమంలో పోలీసులు లాఠీలను ఝుళిపిస్తూ మిగిలిన వారిని అడ్డుకున్నారు. సుమారు గంటసేపు సాగిన సీఎం ప్రసంగం జనాలను ఆకట్టుకోలేకపోయింది. రాష్ట్రం మొత్తం కామన్‌గా ఇస్తున్న సంక్షేమ పథకాలను కూడా కుప్పానికే ప్రత్యేకంగా ఇస్తున్నట్టు వాటి విలువను కోట్లలో లెక్కకట్టి చెప్పడంపైనా జనం నిరాసక్తంగా ఉన్నారు. సీఎం సభ ప్రభావంతో మద్యం ఏరులై పారింది. ఆంధ్రా-కర్ణాటక సరిహద్దులో ఉన్న రాజుపేట రోడ్డులోని నాలుగైదు మద్యం దుకాణాలు మందుబాబులతో కిటకిటలాడాయి.



ఫెన్సింగ్ కింద దూరి ముళ్లకంపల్లో బయటకు వెళుతున్న జనం



సీఎం సభకు సమీపంలో మందుబాబుల సందడి



లాఠీలను ఝుళిపిస్తూ జనాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

సభ బయట ఫొటోలు తీయరాదు

అధికారుల ఆంక్షలు ● బయటకు వెళ్తున్న జనం ఫొటో తీసిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ దాడికి యత్నం

అధికారంలో ఉన్నా అభద్రతలో వైసీపీ నేతలు కూరుకుపోయి ఉన్నారని సోమవారం నాటి సీఎం సభ కవరేజీలో మీడియాపై ఆంక్షలు, అడుగడుగునా నిఘా పెట్టిన తీరు వెల్లడిస్తోంది. ఐ అండ్ పీఆర్ ఆదివారమే ఆంక్షలతో కూడిన ప్రకటన విడుదల చేసింది. 'రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన పబ్లిక్ మీటింగ్ మినహా, అన్ని ప్రాంతాల్లోను ఫొటోస్, వీడియోస్ కవరేజీకి ఐ అండ్ పీఆర్ శాఖకు మాత్రమే అనుమతి కలదు. కావున లైవ్ స్ట్రీమింగ్‌కు సంబంధించి ఫ్రీక్వెన్సీలు, ఫొటోలు ప్రెస్ నోట్లు ఈ గ్రూపులోనే షేర్ చేయడం జరుగుతుంది. దయచేసి పాత్రికేయులు సహకరించగలరు' అని పేర్కొంది. అంటే సీఎం సభ లోపల తప్ప, బయట ఎక్కడా, రోడ్లు, పార్కింగ్ స్థలాలు ఇతర పబ్లిక్ స్థలాలలో ఫొటోలు, వీడియోలు తీయడానికి అనుమతి లేదన్నమాట. ఎక్కడ ఎవరు మొబైల్‌లో ఫొటోలు తీస్తున్నా వైసీపీ కార్యకర్తలు అనుమానంగా నిలదీయడం కనిపించింది. సీఎం ప్రసంగిస్తున్న సమయంలో సభనుంచి వెళ్లిపోతున్న జనాన్ని ఫొటోలు తీస్తున్న ఆంధ్రజ్యోతి చిత్తూరు ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై వైసీపీ మూకలు దాడి చేశాయి. కెమెరాను లాక్కుని అందులోని ఫొటోలను డిలీట్ చేశాయి. ఈ సందర్భంగా పోలీసులు కూడా ఆ మూకలకే వంత పాడాయి. ఏ నిజాలు జనంలోకి వెళ్లిపోతాయో అనే భయం సభ నిర్వాహకుల్లో కనిపించింది. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై వైసీపీ శ్రేణుల ఘటనపై జర్నలిస్టు సంఘాలు మండిపడుతున్నాయి. ఫొటోలు డిలీట్ చేసి, దాడికి ప్రయత్నించడం బాధాకరమని చిత్తూరు ప్రెస్‌క్లబ్, ఏపీడబ్ల్యూజే సోమవారం ఒక ప్రకటనలో ఖండించింది. రాప్తాడు ఘటన మరువకముందే మళ్లీ దాడి ప్రయత్నం అనేది పత్రికా ప్రపంచానికి గొడ్డలిపెట్టు అని జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీపతి అన్నారు. మీడియాపై దాడులను అరికట్టడంలో పోలీసులు విఫలమయ్యారని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు తీవ్రంగా విమర్శించారు. ఇకపై మీడియా మిత్రులు కవరేజీకి వెళ్లే సందర్భంగా కత్తులు, కర్రలతో వెళ్లాల్సిన పరిస్థితులు దాపురిస్తున్నాయని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు.

- కుప్పం

పాకాల రైల్వేకాలనీలో దారుణ హత్య

● తలపై బండరాయితో మోది చంపేశారు



పాకాల, ఫిబ్రవరి 26: పాకాల రైల్వే కాలనీలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాలనీలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ సమీపంలో చింతచెట్ల కింద పాకాల పోలీస్‌స్టేషన్‌కి కూతవేటు దూరంలో ఆదివారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తిని తలపై బండరాయితో మోది చంపినట్లు స్థానికులు సోమవారం ఉదయం గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాకాల ఎస్‌ఐ2 ఇషాక్ బాషా, రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారు 30 ఏళ్ల వయసు ఉంటుందని ప్యాంటు, షర్టు ధరించి ఉన్నాడని తెలిపారు. వ్యక్తిగత ఆధారాలేమీ లభ్యం కాలేదన్నారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మద్య నిషేధం ఎక్కడ జగన్?

టీడీఆర్ బాండ్ల బాధితులతో కలిసి పోరాటం చేస్తాం

తిరుపతిలో నేడు 'జయహో బీసీ': టీడీపీ

తిరుపతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): 'మద్య నిషేధం చేశాకే ఎన్నికలకు వస్తానని సీఎం జగన్ చెప్పారు. ఇపుడు ఏ ముఖం పెట్టుకుని జనాన్ని ఓట్లు అడుగుతారు' అని టీడీపీ నేతలు ప్రశ్నించారు. తిరుపతి కపిలతీర్థం రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో సోమవారం సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్ మాట్లాడారు. నాసిరకం మద్యంతో ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న జగన్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండు చేశారు. తిరుపతిలో మాస్టర్‌ప్లాన్ రోడ్లు ఎవరికోసం వేశారో మీడియా సమక్షంలో చూసేందుకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) బాండ్లలో భారీ కుంభకోణం జరిగిందని, నిజమైన బాధితులతో కలసి పోరాటం చేస్తామన్నారు. దొంగ ఓట్లతో గెలిచేందుకు వైసీపీ అభ్యర్థి అప్‌డేట్ అయ్యారని ఆరోపించారు. కుమారుడిని ఎమ్మెల్యే చేసేందుకు కరుణాకర రెడ్డి బూటకపు హామీలు ఇస్తున్నారని విమర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తిరుపతి నియోజకవర్గానికి సంబంధించి నగరంలోని ఇందిరా మైదానంలో మంగళవారం ఐదు గంటలకు జయహో బీసీ కార్యక్రమం జరగనుందన్నారు. తిరుపతి పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల నుంచి టీడీపీ శ్రేణులతోపాటు చేతివృత్తులు, కులసంఘాల వారు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. బీసీలందరూ ఒకేతాటిపై నిలిచి చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సమావేశం జరిగే మైదానాన్ని పరిశీలించారు. ఎన్నికల పరిశీలకుడు చినబాబు, క్లస్టర్ ఇన్‌చార్జులు, రాష్ట్ర, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

పంట పొలాలపై ఏనుగుల దాడులు



గుట్టపాళ్యం, గూబలవారిపల్లె సమీపంలో పొలాల్లో ఏనుగుల పాదముద్రలు, ధ్వంసమైన వరి

పాకాల, ఫిబ్రవరి 26: పాకాల, ఐరాల మండలాల సరిహద్దులో మొరవపల్లె, కాకర్లవారిపల్లె, గుట్టపాళ్యం, గూబలవారిపల్లె, వేదగిరివారిపల్లె సమీపంలోని పంట పొలాలపై ఆదివారం రాత్రి ఏనుగులు దాడి చేశాయి. గూబలవారిపల్లెకు చెందిన సేతురాం, వేదగిరివారిపల్లెకు చెందిన శివాజి, గుట్టపాళ్యంకు చెందిన విజయనాయుడులకు చెందిన వరిపొలాలను తొక్కి తీవ్ర నష్టం కలిగించాయి. గుట్టపాళ్యం విజయనాయుడు పరిపొలంవద్ద నున్న బావిలో ఓ గున్న ఏనుగు పడిపోగా.. దానిని రక్షించి పెద్ద ఏనుగులు తీసుకెళ్లిపోయిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఈ ప్రదేశమంతా ఏనుగులు తొక్కేయడంతో వరిపంట ధ్వంసమైంది. పంటపొలాలపై కొన్ని నెలలుగా వరుస దాడులతో ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నా.. సంబంధిత అటవీ అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఏనుగుల బెడద తప్పించాలని కోరుతున్నారు.

'పద్మావతి' ఆస్పత్రిలో 1నుంచి ఆరోగ్యశ్రీ సేవలు

● తిరుమలలోని క్యాంటీన్‌లో కాంట్రాక్ట్ సిబ్బందికి రాయితీపై అల్పాహారం, భోజన సదుపాయం
● తిరుపతిలో రూ.7.51కోట్లతో నూతన స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం ● టీటీడీ చైర్మన్ భూమన

తిరుమల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో స్విమ్స్‌కు అనుబంధంగా ఉన్న శ్రీపద్మావతి జనరల్ ఆస్పత్రిలో మార్చి ఒకటినుంచి ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న రోగులకు నగదు రహిత వైద్య సేవలు అందిస్తామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, మానసిక వ్యాధులు, పీడియాట్రిక్ వంటి ప్రత్యేక విభాగాలతోపాటు జ్వరాలు, వాంతులు, విరేచనాలు వంటి సాధారణ వ్యాధులకూ వైద్యసేవలు అందిస్తారన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో సోమవారం టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. అనంతరం ఈవో ధర్మారెడ్డి, బోర్డు సభ్యులతో కలిసి బోర్డు నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. టీటీడీలోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, సొసైటీల్లోని సిబ్బందికి, వర్క్ కాంట్రాక్ట్ పరిధిలోని ఎఫ్‌ఎంఎస్, పారిశుధ్య సిబ్బందికి తిరుమలలోని ఉద్యోగుల క్యాంటీన్‌లో రాయితీపై అల్పాహారం, భోజన సదుపాయం కల్పించేందుకు నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. ఉద్యోగుల క్యాంటీన్‌లో వంటశాల, భోజనశాల విస్తరణకు రూ.8.15 కోట్లు, అవసరమైన వంట సామగ్రి కొనుగోలుకు రూ.3కోట్ల మంజూరుకు ఆమోదం తెలిపామన్నారు. అన్నప్రసాద విభాగంలో సూపర్‌వైజరీ పోస్టుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు నిర్ణయించామని, అలాగే కిందిస్థాయి పోస్టులను కార్పొరేషన్ లేదా ఔట్‌సోర్సింగ్ ద్వారా నియామకానికి ఆమోదం తెలిపామని చెప్పారు.

తిరుమలలో దాదాపు 30 ఏళ్ల క్రితం గడువుచెల్లిన హాకర్ లైసెన్సు రెన్యువల్స్ దుకాణాల స్థల మార్పిడి అంశాలను

హాకర్ లైసెన్సు రెన్యువల్స్‌పై..?

కూడా బోర్డు అజెండాలో పొందుపరిచినట్టు తెలిసింది. అయితే వీటిపై ఎలాంటి నిర్ణయం తీసుకున్నారనే విషయం బయటకు వెల్లడి కాలేదు.

మరికొన్ని నిర్ణయాలివీ..

- టీటీడీ ఆధ్వర్యంలో తిరుపతి పుట్టినరోజును ప్రతి ఏడాది ఫిబ్రవరి 24వ తేదీన నిర్వహించాలని నిర్ణయం. టీటీడీ క్యాలెండరులోనూ ఈ రోజును చేర్చాలని తీర్మానం.
- టీటీడీ అటవీ విభాగంలో విధులు నిర్వహిస్తూ శ్రీలక్ష్మీ శ్రీనివాస మ్యాన్‌పవర్ కార్పొరేషన్‌లో ఉన్న ఉద్యోగులను తిరిగి వారి సొసైటీలకు బదిలీ చేసి, వేతనాలు పెంచి, బస్సు పాసులు ఇచ్చేందుకు ఆమోదం.
- వడమాలపేట పాదిరేడు అరణ్యం వద్ద టీటీడీ ఉద్యోగులకు కేటాయించిన ఇళ్లస్థలాల లేఔట్, ఇతర అభివృద్ధి చార్జీలకు సంబంధించి రూ.8.16 కోట్లు తుడాకు చెల్లించేందుకు ఆమోదం. ఈమొత్తాన్ని ఉద్యోగులు తిరిగి టీటీడీకి చెల్లిస్తారు.
- శ్రీలంకలో శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహణకు నిర్ణయం.
- తిరుమలలోని సప్తగిరి విశ్రాంతి భవనంలో 1, 4వ బ్లాకుల ఆధునికీకరణకు రూ.3.19 కోట్ల మంజూరుకు ఆమోదం.
- పాపవినాశనం, కుమారధార, పసుపుధార, ఇతర ప్రాంతాల్లోని 682 మోటార్ పంపు సెట్ల స్థానంలో కొత్తవాటి ఏర్పాటుకు రూ.3.15 కోట్ల మంజూరు.
- తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అతిథి భవనాలు, పీఏసీలో ఎఫ్‌ఎంఎస్ సేవలు మరో మూడేళ్ల పొడిగింపు.
- తిరుపతిలోని శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవర్లకు నూతన బంగారు కవచాల తయారీకి ఆమోదం. రూ.15లక్షలతో రెండు తండ్లకు బంగారు మలాం వేసిన కాపర్ రేకులు ఏర్పాటు.
- తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో గత ఏడాది తరహాలోనే జాతర నిర్వహణకు రూ.50లక్షల మంజూరుకు ఆమోదం.
- టీటీడీ ఆస్థాన సిద్ధాంతి తంగిరాల వెంకటకృష్ణ పూర్ణప్రసాద్ పదవీ కాలం మరో మూడేళ్ల పొడిగింపు.
- జమ్మూలో నిర్మించిన శ్రీవారి ఆలయంలో పనిచేసే సిబ్బందికి హెచ్‌ఆర్‌ఏ పెంపునకు ఆమోదం.
- తిరుపతిలోని హరేరామ హరేకృష్ణ రోడ్డులో ఇన్‌కమ్ ట్యాక్స్ గెస్ట్ హౌస్ వెనుక ఉన్న ఖాళీ స్థలంలో రూ.7.51 కోట్లతో నూతన స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఆమోదం.
- అలిపిరి కాలినడక మార్గంలో గాలిగోపురం, శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్దనున్న ముగ్గుబావుల ఆధునికీకరణకు నిర్ణయం.



టీటీడీ బోర్డు సభ్యులతో సమావేశమైన చైర్మన్ కరుణాకరరెడ్డి

ముక్కంటి సేవలో రష్యా భక్తులు



రాహు-కేతు పూజల్లో పాల్గొన్న రష్యన్లు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26: ముక్కంటి ఆలయాన్ని సోమవారం రష్యా భక్తులు దర్శించుకున్నారు. 15 మంది రష్యా భక్తులు ముందుగా ఆలయంలో రాహు-కేతు సర్పదోష నివారణ పూజలను జరిపించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ శిల్ప సౌందర్యాన్ని వీక్షిస్తూ మంత్ర ముగ్ధులయ్యారు. ఆలయంలోని పగడ చెట్టు వద్ద బయట నుంచి శివనామ స్మరణ చేశారు. స్థానిక భక్తులు విదేశీయులతో సెల్ఫీలు తీసుకునేందుకు ఆసక్తి చూపారు.



మాట్లాడుతున్న సీనియర్ ఏడీఎస్‌టీ సురేష్, హాజరైన ప్రజలు

పాకాల రైల్వే జంక్షన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

● వర్చువల్ విధానంలో పాల్గొన్న ప్రధాని మోదీ

పాకాల, ఫిబ్రవరి 26: అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా పాకాల రైల్వే జంక్షన్‌లో అభివృద్ధి పనులకు సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్ ఏడీఎస్‌టీ సురేష్ మాట్లాడుతూ పాకాల జంక్షన్‌లో అభివృద్ధి పనులకు రూ.7.28 కోట్లు మంజూరయ్యాయన్నారు. నూతన స్టేషన్ భవనం, పార్కింగ్, వెయిటింగ్ హాల్, తాగునీటి సౌకర్యాలు, ప్రవేశ నిష్క్రమణలకు వేర్వేరు మార్గాల ఏర్పాటు, వెయింటింగ్ ఏరియా తదితర సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు. అలాగే గుంతకల్లు డివిజినల్ పరిధిలో 15 రైల్వేస్టేషన్‌ల అభివృద్ధి, 24 అండర్ బ్రిడ్జిలు ఈ పథకంలో అభివృద్ధి చేస్తామన్నారు. స్థానిక ఇన్‌ఫెంట్ జీసస్ పాఠశాల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్టేషన్ మాస్టర్ వెంకటమున్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సంగీత లక్ష్మి, డీఎంవో డాక్టర్ రామ్మోహన్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ సిద్ధారెడ్డి, టెలికాం ఎస్ఎస్ఈ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే ఎన్ఆర్ జయదేవనాయుడు, సర్పంచ్ కస్తూరి, జట్పీటీసీ నంగా పద్మజరెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పురుషోత్తం నాయుడు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి యూనిఫాం పంపిణీ



పాకాల, ఫిబ్రవరి 26: పాకాల గ్రామ పంచాయతీలో పారిశుధ్య, వాటర్‌వర్క్స్ కార్మికులకు సోమవారం సర్పంచ్ కస్తూరి చేతులమీదుగా యూనిఫాం పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి రెండు జతల యూనిఫాం, రెండు జతల చెప్పులు, సోపులు, కొబ్బరినూనె అందజేశారు. పంచాయతీ కార్యదర్శి మోతీ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన కరపత్రాల విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న పులివర్తి నాని

పాకాల, ఫిబ్రవరి 26: చంద్రగిరి నియోజకవర్గ జనసేన పార్టీ మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం దామలచెరువులో హర్ ముస్లిం జనసేన-టీడీపీకే సాత్ కార్యక్రమానికి సంబంధించి టీడీపీ నాయకుడు పులివర్తి నాని చేతులమీదుగా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన కార్యదర్శి ఎం.నాసీర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ అనాలోచిత, చేతకాని నిర్ణయాలతో అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మారిపోయిందన్నారు. పవన్ కళ్యాణ్, చంద్రబాబు ఈ రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. జనసేన నాయకులు తలారి గురునాథ్, దినేష్, రహమతుల్లా, షాజహాన్, మస్తాన్, టీడీపీ నాయకులు షఫీ, ఇమాంసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి ఉమ్మడి అభ్యర్థిని నేనే: పులివర్తి నాని

ఎర్రావారిపాలెం, ఫిబ్రవరి 26: చంద్రగిరి టీడీపీ-జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిని నేనేనని పులివర్తి నాని స్పష్టం చేశారు. పార్టీ కేడర్‌ను, ఓటర్లను తికమక పెట్టేందుకు కొంతమంది కావాలని దుష్ప్రచారాలు చేస్తుంటారన్నారు. సోమవారం కమలయ్యగారిపల్లె పంచాయతీలో వైసీపీ నుంచి నాగార్జునరెడ్డి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ.. చంద్రగిరి ఓటర్లలో మార్పు వచ్చిందన్నారు. తాయిలాలకు లోనుకాకుండా టీడీపీకి ఓటు వేయనున్నారని జోస్యం చెప్పారు. బాధ్యతాయుతమైన, పారదర్శక పాలన కావాలంటే టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ, ప్రధాన కార్యదర్శి మహేష్ నాయుడు, మాజీ సర్పంచ్ రామచంద్రయ్య, విజయారెడ్డి, జయపాల్ రెడ్డి, పగడాల సురేంద్రబాబు, సుబ్రహ్మణ్యం, రమణ, పురుషోత్తం, రాజేష్, జగదీష్, నిరంజన్ రాయల్, రఘునాథ, రమేష్, హరిశ్చంద్ర, మురళి, కుంబా నాగరాజ, ఎస్సీ సెల్ నాగరాజ, వేణుగోపాల్, రమణారెడ్డి, శ్రీధర్ బాబు, కొమ్మక లక్ష్మిదేవి, చిట్టిబాబు నాయుడు, సుధాకర్ నాయక్, పద్మనాభ, నాగభూషణ, బాబు, దేశిరెడ్డి శేషనాయుడు, చంద్రబాబు, వెంకటశివరామిరెడ్డి, యనమల దేవి, అమరనాథరెడ్డి, గురప్ప, రాజు, జనసేన జిల్లా కార్యదర్శి కల్ప రవి, మండల అధ్యక్షుడు ముండ్లపాటి మురళి, సుధీర్, శంకర్ రెడ్డి, రవి రెడ్డి, పురుపోత్తం రెడ్డి, తలారి శివ తదితరులు పాల్గొన్నారు.

ఆగివున్న బస్సును ఢీకొన్న ఆటో

● ఆటో డ్రైవర్‌కి తీవ్రగాయాలు



ఆటో ఇరుక్కుపోయిన డ్రైవర్ మునాఫ్

చంద్రగిరి, ఫిబ్రవరి 26: చంద్రగిరి మండలం ఐతేపల్లె వద్ద ఆగివున్న బస్సును ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ మునాఫ్‌కి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం ఉదయం తిరుపతి నుంచి పూతలపట్టుకు ప్రైవేటు కళాశాల బస్సు వెళుతూ ఐతేపల్లె వద్ద ఆగింది. తిరుపతి నుంచి చిత్తూరుకు వెళుతున్న ఆటో ముందున్న బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ఆటోనే ఇరుక్కుపోయి తీవ్రంగా గాయపడ్డాడు. అందులో ప్రయాణిస్తున్న తిరుపతికి చెందిన వసంత, యాదమరికి చెందిన మౌనికకు గాయాలయ్యాయి. ఆటోడ్రైవర్‌ని స్థానికులు, పోలీసులు ఆటో నుంచి అతికష్టంపై బయటకు తీసి తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రగిరికి చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు

చంద్రగిరి, ఫిబ్రవరి 26: ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం మొదటి సెట్ ప్రశ్నపత్రాలు సోమవారం చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాయి. మార్చి 1వ తేది నుంచి ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. చంద్రగిరిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో రెండు సెంటర్లు, బాలికల జూనియర్ కళాశాలలో రెండు సెంటర్లు ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరం 2వేల మంది, ద్వితీయ సంవత్సరం 1800 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రశ్నపత్రాలను స్టేషన్‌లో భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో కస్టోడియన్ శ్రీలత, సెంటర్ సూపర్‌వైజర్లు సుబ్బరాయుడు, హరిత, హేమలత, రాజశేఖర్‌రెడ్డి, లెక్చరర్స్ రవి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి స్వాగతం, వీడ్కోలు

రేణిగుంట, ఫిబ్రవరి 26: చిత్తూరు జిల్లా కుప్పం పర్యటనలో భాగంగా సోమవారం తిరుపతి విమానాశ్రయం చేరుకున్న సీఎం జగన్‌కు స్వాగతం, వీడ్కోలు లభించింది. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో సీఎం సోమవారం ఉదయం 10.02 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. ఆయనతోపాటు మంత్రి అంబటి రాంబాబు వచ్చారు. వీరికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అనంతపురం జిల్లా కలెక్టర్ గౌతమి, ఎస్పీ మలికా గర్గ్, జేసీ శుభంబన్సల్, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రహ్మణ్యం, కళ్యాణ చక్రవర్తి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం సీఎం 10.18 గంటలకు కుప్పానికి హెలికాప్టర్‌లో బయలుదేరారు. కాగా.. కుప్పం పర్యటన ముగించుకొని సాయంత్రం 3.52 గంటలకు విమానాశ్రయం చేరుకున్నారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తదితరులు వీడ్కోలు పలికారు.

మాట ఇచ్చి మడమ తిప్పేశారు

● తొలుత చెప్పిన చోటే జగనన్న స్థలాలు ఇవ్వాలి ● సీపీఎం భూ పోరాటం



సీపీఎం నాయకులు, లబ్ధిదారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

తిరుపతి (రవాణా), ఫిబ్రవరి 26: జగనన్న ఇళ్ల స్థలాల పట్టాలు పొందిన లబ్ధిదారులకు స్థలాలను సాధించేందుకు సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం మంగళం పరిధిలోని బీటీఆర్ కాలనీ నుంచి లబ్ధిదారులతో కలిసి సీపీఎం నాయకులు భూపోరాట ర్యాలీ చేపట్టారు. గతంలో లబ్ధిదారులకు కేటాయిస్తామని చెప్పిన భూమి వద్దకు ర్యాలీ చేరుకోగానే తిరుచానూరు పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాల క్రితం ప్రస్తుత సర్వే అకాడమీకి కేటాయించిన భూమిలో ఉమ్మడి మంగళం పంచాయతీలో పేదలకు జగనన్న ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు సిద్ధం చేస్తున్నామని నాయకులు ప్రగల్భాలు పలికారన్నారు. అనంతరం ఆ భూమిని సర్వే అకాడమీకి కేటాయించారని, దీంతో లబ్ధిదారులందరికీ చిందేపల్లి వద్ద స్థలాలు ఇస్తున్నామని చెప్పారని గుర్తుచేశారు. ఆ మాట చెప్పి కూడా సంవత్సరాలు గడిచాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ హడావుడిగా స్థలాలు చూపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని స్థానికంగా ఉన్న పేదలకు స్థానికంగానే స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవనోపాధికి కూడా అనువుగా లేని ప్రదేశాల్లో స్థలాలు చూపడం దారుణమైన విషయం అన్నారు. గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని.. అప్పటి వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. నాగరాజుతో పాటు పలువురు నాయకులను, కొందరు లబ్ధిదారులను అదుపులోకి తీసుకున్నారు. ఆపై లబ్ధిదారులను మాత్రం విడిచిపెట్టారు. అరెస్టును నిరసిస్తూ సీపీఎం శ్రేణులు తిరుచానూరు పోలీస్‌స్టేషన్ వద్ద సాయంత్రం ధర్నా చేపట్టడంతో నాయకులను కూడా సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టును సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఖండించారు. నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం, నేతలు జయచంద్ర, సాయిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రసూతి ఆస్పత్రిలో పర్సు, సెల్‌ఫోను చోరీ

● ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 26 : ప్రసూతి ఆస్పత్రిలో కాన్పు అనంతరం చికిత్స పొందుతున్న మహిళ పర్సు, సెల్‌ఫోను చోరీకి గురయ్యాయి. ఈ విషయమై బాధితులు మూడు రోజుల క్రితం వెస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. బాధితుల వివరాల మేరకు.. రొంపిచెర్లకు చెందిన షేక్ అస్మిత కాన్పు కోసం ఈనెల 21న స్థానిక ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి వచ్చింది. మరుసటి రోజునే కాన్పు కావడంతో ఆస్పత్రిలోనే ఉంటూ చికిత్స పొందుతుంది. 22వ తేదీ రాత్రి వార్డులో నిద్రిస్తున్న క్రమంలో పడక పక్కనే ఉన్న పర్సు, సెల్‌ఫోను కనిపించకపోవడంతో వెంటనే విషయాన్ని ఆస్పత్రిలోని సెక్యూరిటీ సిబ్బందికి దృష్టికి తీసుకువచ్చింది. వారు నిర్లక్ష్యంగా మాట్లాడటంతో బాధితులు 23 తేదీన వెస్ట్ పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫిర్యాదు స్వీకరించలేదు. ఫోన్‌లో విలువైన సమాచారం ఉందని, పర్సులో రూ.ఐదు వేల వరకు నగదు ఉందని విన్నవించినా పట్టించుకోలేదు. తెలిసిన వారి సాయంతో సోమవారం సాయంత్రం మరోసారి స్టేషనుకు వెళ్లడంతో ఫిర్యాదు స్వీకరించారు. కానీ కేసు నమోదు చేయకుండా కాలయాపన చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి ప్రారంభం



అండర్ బ్రిడ్జి ప్రారంభోత్సవంలో బీజేపీ నాయకులు, అధికారులు

తిరుపతి(ఆటోనగర్) ఫిబ్రవరి 26: తిరుపతి-చంద్రగిరి రైలు మార్గంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయం వద్ద అండర్ బ్రిడ్జిని సోమవారం మధ్యాహ్నం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, పి.సి.రాయులు, రాధాకృష్ణ, మునిసుబ్రమణ్యం, సుబ్రమణ్యంయాదవ్, సామంచి శ్రీనివాస్, గుండాల గోపీనాథ్‌రెడ్డి, అజయ్‌కుమార్, నరేంద్రరెడ్డి, పేరూరు సర్పంచ్ కేశవులు, అధికారులు శేషు, చిన్నప్పరెడ్డి, పి.సురేష్‌బాబు, కె.మధుసూదన్, నాగేశ్వర్‌రావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కబ్జాల నుంచి తిరుపతిని కాపాడండి



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

తిరుపతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : భూ కబ్జాదారుల నుంచి తిరుపతిని కాపాడాలని టీడీపీ నేతలు డిమాండు చేశారు. గురువారం లీలామహల్ సర్కిల్లోని పార్టీ కార్యాలయంలో 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్ర నాయుడు మీడియాతో మాట్లాడారు. మాస్టర్ ప్లాన్ రోడ్లతో వేలకోట్ల రూపాయల అవినీతికి తెరలేపారని ఆరోపించారు. ఓట్ల కుంభకోణం మరచిపోకముందే టీడీఆర్ కుంభకోణం, భూ కబ్జాలతో తిరుపతి పరువు మరోసారి రోడ్డునపడిందని మండిపడ్డారు. ఎన్ఆర్ఐలు తిరుపతిలో స్థలం కొనుక్కోవాలని ఎంతో ఆశపడతారని, అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో వారి స్థలాలకు రక్షణ లేకుండా పోతోందని అన్నారు. కైకాలచెరువు గ్రామ లెక్కదాఖలా సర్వే నెం 1లో 60 అంకణాల విస్తీర్ణం కలిగిన 26 ప్లాట్లు కబ్జాకు గురయ్యాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇందులో 7 ప్లాట్లు ఎన్ఆర్ఐలవని తెలిపారు. అధికారులు, పోలీసులను అడ్డుపెట్టుకుని భూ బకాసురులు ఇష్టారాజ్యంగా రెచ్చిపోతున్నారని మండిపడ్డారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండు చేశారు. ఈ సమావేశంలో నాయకులు మహేష్ యాదవ్, ఆర్సీ శ్రీనివాసులు, సుబ్బుయాదవ్, శంకర్, గంజి సుధాకర్ రెడ్డి, ఎస్వీఎం శ్రీధర్, జగ్గు, నాగప్రతాప్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు పథకాలపై కళాజాత

రామచంద్రాపురం, ఫిబ్రవరి 26: మండలంలోని నడవలూరు, నెన్నూరు తదితర గ్రామాల్లో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బ్యాంకు పథకాలపై కళాజాతా బృందం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బ్యాంకు మేనేజరు లలిత, ఫీల్డ్ ఆఫీసర్ కిషోర్‌బాబు, క్యాషియర్ వరప్రసాద్‌రెడ్డి, అటెండర్ నారాయణస్వామి, కళాజాత బృందం సభ్యులు వినోద్, చిరంజీవి, విజయ్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న బడి సుధాయాదవ్

తుమ్మలగుంట చెరువు ఆచూకీ ఎక్కడ?

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 26: తుమ్మలగుంట చెరువు ఆచూకీ ఎక్కడో చెప్పాలంటూ ఓబీసీ ఫోరం కన్వీనర్ బడి సుధా యాదవ్ వినూత్నరీతిలో నిరసన తెలియజేశారు. తిరుపతి రూరల్ తుమ్మలగుంట చెరువును సంరక్షించాలని కోరుతూ ఈఎస్ఐ ఆస్పత్రి నుంచి రూరల్ పోలీసు స్టేషన్ వరకు ఆయన సోమవారం ర్యాలీ నిర్వహించారు. చెరువూ.. చెరువూ ఎక్కడున్నావంటూ నినాదాలు చేశారు. అనంతరం తిరుపతి రూరల్ సీఐ, ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రాలు సమర్పించారు. తుమ్మలగుంట చెరువు సుందరీకరణ పేరుతో రూ. 100 కోట్ల తుడా నిధులు చెరువులో పోశారని విమర్శించారు. సంబంధిత అధికారులు 48 గంటల్లో స్పందించకుంటే తాను ఉద్యమం చేపడతానని ప్రకటించారు.

హథీరాంజీ మఠం తాత్కాలిక మహంతుగా ఓం ప్రకాష్ దాస్

తిరుపతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): హథీరాంజీ మఠం తాత్కాలిక మహంతుగా ఓం ప్రకాష్ దాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనేక ఆరోపణలతో ఇదివరకు మహంతుగా ఉన్న అర్జున్ దాస్‌ను ధార్మిక పరిషత్ ఇటీవల సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తిరుమల జపాలి ఆంజనేయస్వామి ఆలయంలో పూజారిగా ఉన్న ఓం ప్రకాష్ దాస్‌ను తాత్కాలిక మహంతుగా నియమిస్తూ రాష్ట్ర దేవదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మఠం ఫిట్ పర్సన్ రమేష్ నాయుడు ఆయనకు



బాధ్యతలు అప్పగించారు. ధార్మిక వ్యవహారాల కార్యకలాపాలపైనే మహంతుకు అధికారాలను అప్పగిస్తూ ధార్మిక పరిషత్ నిర్ణయం తీసుకుంది. కాగా ఫిట్ పర్సన్‌గా ఉన్న రమేష్ నాయుడు హోదాను పరిపాలన అధికారిగా మారుస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ కార్యక్రమంలో మఠం ఏఏవో శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

బస్సు ఢీకొని రైతు కూలీ మృతి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26: తొట్టంబేడు మండలం చిన్న సింగమాల వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాఘవయ్య అనే రైతు కూలీ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. సింగమాల దళితవాడకు చెందిన రాఘవయ్య (44) రైతు కూలీ. సమీపంలో పొలాల్లో పనులకు వెళ్లి మధ్యాహ్నం సింగమాల రోడ్డు పక్కన చెట్టు వద్ద నిద్రిస్తుండగా ప్రైవేటు స్కూల్ బస్సు అదుపుతప్పి రాఘవయ్యను ఢీకొంది. ఆ సమయంలో బస్సులో చిన్నారులు కూడా ఉన్నారు. స్థానికులు బస్సును తప్పించి రాఘవయ్యను ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బస్సులో విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ పరారయ్యాడు. శ్రీకాళహస్తి టుటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా రాఘవయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

గూడూరు, ఫిబ్రవరి 26: విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలైన ఘటన గూడూరు పట్టణంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.... స్థానిక మసీదువీధిలో కాపురం ఉంటున్న అఫ్జల్(52), అల్లాబక్షు పెయింట్ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. సోమవారం సనత్‌నగర్‌లో ఓ ఇంటికి రంగులు వేస్తుండగా సమీపంలోని 11కేవీ విద్యుత్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యారు. వెంటనే ఏరియా ఆస్పత్రికి తరలించగా అఫ్జల్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. అల్లాబక్షును మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఒకటో పట్టణ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 26: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన నాయుడుపేట పట్టణంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు... పెళ్లకూరు మండలం చావాలి గ్రామానికి చెందిన రమేష్(35) నాయుడుపేటలో నివాసం ఉంటూ కూలి పనులు చేసుకుంటున్నాడు. ఇటీవల కుటుంబ కలహాల కారణంగా భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో రమేష్ మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం శ్రీరామకాలనీ మెయిన్ వీధి వద్ద రమేష్ పడిపోయి ఉండటంతో గమనించిన స్థానికులు 108కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకుని రమేష్‌ను నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

బార్ షాపు



● బార్ లైసెన్సును రీటైల్ కౌంటర్స్‌గా వినియోగం
● పట్టించుకోని అధికారులు



తిరుపతి, ఆంధ్రజ్యోతి: తిరుపతిలో బార్లకు, వైన్ షాపులకు తేడా తెలియడం లేదు. స్టార్ హోటల్లో ఉండే బార్లు బడ్డీ బంకుల్లా మారి రోడ్లపైకి వచ్చేస్తున్నాయి. ఆర్టీసీ బస్టాండు సమీపంలోని పీఎల్ఆర్ హోటల్ ముందు తాజాగా వెలసిన వైన్ షాపును చూసి మందుబాబులే కాదు దారినపోయేవారు కూడా విస్తుపోతున్నారు. అలాగే ఏఐఆర్ బైపాస్ రోడ్డులో రోబో డైనర్ పక్కన మరో బార్ షాపు ఏర్పాటైంది. వైన్‌షాపు అంటే మందుబాబులు వారికి కావాల్సిన మద్యాన్ని బాటిళ్ల రూపంలో తీసుకుని వెళ్లాలి. బార్ అంటే మద్యం తాగేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించాలి. వైన్ షాపు వద్ద మద్యం తాగకూడదు, బార్లో మద్యం క్వార్టర్ బాటిళ్లు విక్రయించకూడదనేది ఎక్సైజ్ నిబంధన. అధికార పార్టీ పెద్దలకు అలాంటి నిబంధనలేవీ వర్తించినట్టు కనిపించడం లేదు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కూడా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అక్రమ సంపాదనతోనే చెవిరెడ్డి తాయిలాలు: నాని



మహిళకు అభివాదం చేస్తున్న నాని

తిరుచానూరు, ఫిబ్రవరి 26: అక్రమ సంపాదనతో తాయిలాలే పెట్టుబడిగా పెట్టి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన చెవిరెడ్డి భాస్కరరెడ్డి మరోసారి జనాన్ని వంచించేందుకు సిద్ధమయ్యారని చంద్రగిరి టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నాని విమర్శించారు. సోమవారం 'మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు పంచాయతీలో పర్యటించారు. రోడ్లు వేయడం, బ్రిడ్జిలు, కల్వర్టులు, వంతెనలు నిర్మించడం చిన్న తరహా పరిశ్రమలు తీసుకురావడం వంటి అంశాలను పూర్తిగా ఎమ్మెల్యే విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. దొంగ ఓట్లు నమోదుతో చంద్రగిరి పేరును దేశవ్యాప్తంగా దిగజార్చేశారని ఆగ్రహించారు.

మద్యంపై రూ.40వేల కోట్లు అప్పు

మద్య నిషేధం చేసి ఓట్లు అడుగుతానన్న హామీపై జగన్ మాట తప్పి మడమ తిప్పాడని నాని విమర్శించారు. పైగా రాబోయే 15ఏళ్ల పాటు మద్యం ఆదాయం తాకట్టు పెట్టి రూ.40వేల కోట్లు అప్పు తెచ్చి తాడేపల్లి ప్యాలెస్‌లో దాచుకున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈశ్వరరెడ్డి, అమిలినేని మధు, మధుశేఖర్, కిషోర్‌రెడ్డి, సురేంద్రనాయుడు, వాసు, మునిరత్నంరెడ్డి, హరేరామ్, సాయిరాయల్, సాల్మాన్‌రాజు, అరుణాచలం, చైతన్య, కళావతి తదితరులు పాల్గొన్నారు.

చదువులో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

ఏపీ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న జేడీ వెంకటకృష్ణారెడ్డి, పక్కనే డీఈవో శేఖర్ తదితరులు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 26: వచ్చే నెలలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధన కోసం ప్రత్యేక ప్రణాళికలు ఆచరించాలని ఏపీ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ ఎం.వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలం చిగురువాడలో ఉన్న ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం కడప, తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు చెందిన ఏపీ మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాళ్లు, పీజీ టీచర్లకు అకడమిక్స్‌పై సమావేశం నిర్వహించారు. జేడీ మాట్లాడుతూ.. గత సంవత్సర ఫలితాలను విశ్లేషిస్తూ ఈ ఏడాదిలో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక ప్రణాళికలు అవసరమని విశదీకరించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. డీఈవో డాక్టర్ వి.శేఖర్, సీబీఎస్ఈ రాష్ట్ర కోఆర్డినేటర్ సి.శ్రీలత, రాష్ట్ర ఏఎంవో ధర్మకుమార్, ఏపీఎంవో శరత్‌బాబు, తిరుపతి డీవైఈవో ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనే అత్యుత్తమ వైద్యశాలగా స్విమ్స్‌ను తీర్చిదిద్దుతాం: టీటీడీ చైర్మన్



విద్యార్థులకు ట్రోఫీ అందజేస్తున్న టీటీడీ చైర్మన్, స్విమ్స్ డైరెక్టర్

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 26: స్విమ్స్ (శ్రీవెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ)ను దేశంలోనే అత్యుత్తమ ఆస్పత్రిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా టీటీడీ బాధ్యత తీసుకుందని, ఆ దిశగానే ఒకేరోజు మూడు రకాల కీలకమైన ట్రాన్స్‌ప్లాంటేషన్లు చేసి అరుదైన ఘనత సాధించిందని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. స్విమ్స్ 31వ వార్షికోత్సవాన్ని మహతి ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్ మాట్లాడుతూ.. స్విమ్స్‌లో నిపుణులైన వైద్యులున్నా.. అధునాతన వైద్య పరికరాలు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని గ్రహించి రూ.500 కోట్లను కేటాయించినట్లు చెప్పారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడుతూ మూడు దశాబ్దాల్లో స్విమ్స్ ఎంతో పురోగతి సాధించిందన్నారు. టీటీడీ ఆధీనంలోకి వచ్చాక మరింత అభివృద్ధి సాధించిందన్నారు. ఎంపీ గురుమూర్తి, మేయర్ డాక్టర్ శిరీష, డీన్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ అపర్ణ బిట్ల, ఎంఎస్ డాక్టర్ రామ్, ఫిజియోథెరపీ, నర్సింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు మాధవి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లులేని పేదలకు స్థలాలు చూపించాలి: సీపీఐ



ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

తిరుపతి (రవాణా), ఫిబ్రవరి 26: ఇల్లులేని పేదలకు స్థలాలు వెంటనే ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద ఇల్లులేని పేదలతో కలిసి ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కుంట్రపాకం వద్ద పోరాటాల ద్వారానే ఇల్లు వేయిస్తామన్నారు. తిరుపతి రూరల్ ప్రాంతాల్లో నివాసం ఉండే నిరుపేదలకు (దాదాపు 35వేల మందికి పైగా) జగనన్న ఇంటి పట్టాలు మంజూరు చేశారని, అయితే నివాసానికి అందుబాటులో లేని లేఅవుట్లను ఇచ్చారని తెలిపారు. జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ ప్రభుత్వం ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన భూములన్నీ వివాదాల మధ్య నడుస్తున్నాయని తెలిపారు. హథీరాంజీ భూముల్లో సీపీఐ ఆధ్వర్యంలో భూపోరాటం చేసి పేదలకు పంచుతామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచులయ్య, రాధాకృష్ణ, నదియ, శివరాజా, ఎన్‌డీ రవి, పద్మనాభరెడ్డి, చలపతి పాల్గొన్నారు.

అవధాన కల్యాణం పుస్తకావిష్కరణ



తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 26: అవధాని తటవర్తి కల్యాణ్ చక్రవర్తి అవధాన పద్యాలతో రూపొందించిన అవధాన కల్యాణం పుస్తకావిష్కరణ సభ సోమవారం సాయంత్రం బైరాగిపట్టెడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశ మందిరంలో జరిగింది. ఆస్ట్రేలియాలో తెలుగు వెలుగులు విస్తరించడానికి కృషి చేస్తున్నామని, 8 వేల మంది తెలుగువారు నివశించే మెల్‌బోర్న్ నగరంలో అవధానంలో పృచ్ఛకులుగా పాల్గొనే ఎనిమిది మందిని పట్టుకోవడం కష్టంగా ఉందని అవధాని కల్యాణ్ చక్రవర్తి అన్నారు. ఒక్క ఏడాదిలో ఇంటర్నెట్ సహాయంతో వంద అవధానాలు పూర్తి చేశామన్నారు. త్వరలో వేయికి పైగా పద్యాలతో పెద్ద గ్రంథం రూపొందిస్తున్నామని, అందుకు ప్రాతిపదికగా ఈ చిన్న పుస్తకం విడుదల చేశామని తెలిపారు. చిన్నతనం నుంచి ఏడుకొండల స్వామి అంటే ఎనలేని భక్తి ఉందని, అందువలన తిరుపతిలో జరుగుతున్న ఈ సభ దేవుని ఆశీస్సులతో జరుగుతున్నట్లు భావిస్తున్నానని తెలిపారు. ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు దామోదర నాయుడు అధ్యక్షతన జరిగిన సభలో సముద్రాల విజయానంద్, శతావధాని ఆముదాల మురళి ఆత్మీయ అతిథులుగా పాల్గొన్నారు. డాక్టర్ మాలేపట్టు పురుషోత్తమాచారి అనేక పద్యాలను ఉదహరిస్తూ సమీక్ష చేశారు. నిర్వాహకులు, ఆప్తులు అవధాని కల్యాణ్ చక్రవర్తిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జయరామ్ ప్రసాద్, అంకమనాయుడు, పరమేశ్వరయ్య, ఆకులమల్లేశ్వరరావు, కృష్ణస్వామి రాజు, నెమిలేటి కిట్టన్న, టెంకాయల దామోదరం, సురేంద్ర రొడ్డ, పేరూరు బాలసుబ్రమణ్యం వంటి పలువురు సాహితీకారులు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

తిరుపతి

టెన్త్ విద్యార్థులకు విజయసాధన మెటీరియల్ పంపిణీ



విద్యార్థులతో మబ్బు సూర్యనారాయణరెడ్డి, విశ్వనాథరెడ్డి తదితరులు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి26: స్థానిక ఎస్వీజేఎస్ఎం, టీపీపీఎం స్కూల్స్‌లో పదవ తరగతి విద్యార్థులకు మబ్బు సూర్యనారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం విజయసాధన స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు మబ్బు సూర్యనారాయణరెడ్డితో అర్బన్ ఎంఈవోలు బాలాజి, భాస్కర్‌నాయక్, అపుస్మా రాయలసీమ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి కలసి 146మంది విద్యార్థులకు మెటీరియల్ అందజేశారు. హెచ్ఎం మునిశేఖర్ మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో వైద్యశిబిరంతోపాటు రూ.50వేల విలువచేసే స్పోర్ట్స్ కిట్ అందించారని, ఇప్పుడు స్టడీ మెటీరియల్ అందించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

ఈస్ట్ ఎస్ఐ బాధ్యతల స్వీకరణ


ఈస్ట్ ఎస్ఐ మురహరిబాబు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 26 : తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా మురహరిబాబు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన ఆయన 1989 బ్యాచ్‌లో పోలీసు శాఖకు ఎంపికయ్యారు. కొంతకాలంగా తిరుపతి వీఆర్‌లో ఉన్న ఆయన ఇటీవల జరిగిన బదిలీల్లో ఈస్ట్ ఎస్ఐగా నియమితులయ్యారు.

నేడు ఎమ్మార్పీఎస్ జిల్లా సమీక్షా సమావేశం

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 26 : ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల జిల్లా సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర, కో-ఇన్‌ఛార్జి గోపి తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ తిరుపతి నగరంలోని గిరిజన భవనంలో నిర్వహించనున్న ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరుకానున్నారని, ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీం కోర్టులో విచారణ జరిగిన నేపథ్యంలో భవిష్యత్తు కార్యాచరణపై చర్చించనున్నామని పేర్కొన్నారు. సభ్యులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సీఎంను కలిసిన పద్మావతి వర్సిటీ వీసీ


సీఎం జగన్‌తో వీసీ భారతి తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 26: సీఎం జగన్‌ను పద్మావతి యూనివర్సిటీ వీసీ భారతి కలిశారు. కుప్పం పర్యటన కోసం తిరుపతికి వచ్చిన సీఎంను రేణిగుంట విమానాశ్రయంలో ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల పీఎం ఉష పథకం ద్వారా రూ.100 కోట్ల నిధులు యూనివర్సిటీకి వచ్చిన విషయాన్ని వీసీ ఆయనకు తెలియజేశారు. ప్రత్యేక ప్రణాళికతో యూనివర్సిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని సీఎం జగన్ ఆమెకు సూచించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని పాల్గొన్నారు.

అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 26: గుంటూరులో నిర్వహించిన నాటిక, మైమ్ పోటీల్లో పద్మావతి డిగ్రీ కాలేజీ విద్యార్థినులు బహుమతులు పొందారు. మూఢ నమ్మకాలు అంశంపై లఘు నాటిక, పర్యావరణ పరిరక్షణ అంశంపై మైమ్‌ను ప్రదర్శించారు. ఇందులో ప్రథమ స్థానంలో నిలిచి రూ.10 వేల చొప్పున బహుమతులు స్వీకరించారు. నిర్వాహకులు వీరికి బహుమతులు అందజేసి సత్కరించారు. కాలేజీ ప్రిన్సిపాల్ నారాయణమ్మ, అధ్యాపకులు కృష్ణవేణి, భువనేశ్వరిదేవి తదితరులు అభినందించారు. విద్యార్థులకు నందనం అకాడమీ చైర్మన్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి శిక్షణ అందించారు.

భాను ఎంపికపై హర్షం


భానుప్రకాష్‌ను కలసిన టీడీపీ యువత

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 26: టీడీపీ నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా గాలి భానుప్రకాష్ ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ తిరుపతి యువనేత శంకర్‌యాదవ్ తన అనుచరులతో సోమవారం శ్రీనివాసపురంలోని నివాసంలో గాలి భానుప్రకాష్‌ను మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలియజేశారు. నగరి నియోజకవర్గంలోని మెజారిటీ యాదవులు అండగా ఉంటామన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, ఆయన్ను సీఎం చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై ఉండాలని భాను పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు హరిబాబు, గణేష్, సాయి, ప్రవీణ్, శీను, రాము, నగరి నియోజకవర్గ నేత సోము పాల్గొన్నారు.

కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యత్వానికి నరసింహాచారి రాజీనామా

● సాంకేతిక కారణాలతో ఆమోదించని వైనం

తిరుపతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ యువ నేత, 25వ డివిజన్ కార్పొరేటర్ నరసింహాచారి తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యత్వానికి రాజీనామా చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మూడ్రోజుల కిందట తన రాజీనామా లేఖను కమిషనర్ కార్యాలయానికి అందజేసినట్టు సమాచారం. కొన్ని సాంకేతిక కారణాలతో రాజీనామాను ఆమోదించలేక పోతున్నట్టు సమాచారం. 2019 ఎన్నికలకు ముందు టీడీపీ నుంచి వైసీపీలోకి నరసింహాచారి వచ్చిన వెంటనే టౌన్ బ్యాంకు చైర్మన్‌గా నియమితులయ్యారు. కరోనా రావడంతో ఆరు నెలలు కూడా చైర్మన్ సీటులో ఉండలేకపోయారు. మరో ఏడాది పొడిగించమని కోరినప్పటికీ స్థానిక నాయకత్వం అంగీకరించలేదు. అప్పటినుంచి అసంతృప్తితో ఉన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో 25వ డివిజన్ నుంచి గెలిచి స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా నియమితులయ్యారు. పార్టీలో చురుగ్గా ఉంటూ నగరంలోని పలు సమస్యలను కౌన్సిల్ ముందుకు తీసుకొచ్చేవారు. అయినా తనకు ప్రాధాన్యం తగ్గించడంతో అసహనంగా ఉన్నట్లు సమాచారం. అందుకే తన డివిజన్ పరిధిలో జరిగిన తిరుపతి పుట్టిన రోజు ఉత్సవాలకు కూడా దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై స్థానిక నాయకత్వం ఏవిధంగా స్పందిస్తుందో వేచి చూడాలి.

వరాహస్వామిని దర్శించుకున్న శశికళ



తిరుమల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు మాజీ సీఎం జయలలిత స్నేహితురాలు శశికళ శ్రీవారి దర్శనార్థం సోమవారం రాత్రి తిరుమలకు వచ్చారు. రచన అతిథి గృహానికి చేరుకున్న ఆమె క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ శ్రీవారి ఆలయం పక్కనే ఉన్న వరాహస్వామిని దర్శించుకున్నారు. తిరిగి అతిథి గృహానికి చేరుకుని రాత్రి బస చేశారు. మంగళవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

పోలీసు స్పందనకు 86 ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఎస్పీ కాటమరాజు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 26 : ప్రకాశం రోడ్డులోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 86 ఫిర్యాదులు అందాయి. దిశ డీఎస్పీ కాటమరాజు, ఎస్బీ సీఐ రాజశేఖర్ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి ఫిర్యాదుదారులు హాజరై తమ సమస్యలను తెలియజేశారు. వినతులను పరిశీలించిన డీఎస్పీ కాటమరాజు సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.5.09 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.5.09 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 76,577 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 23,656 మంది తలనీలాలు సమర్పించారు. కాగా, టీటీడీ మాజీ ఈవో ఎంజీ గోపాల్ సోమవారం స్వామి వారిని దర్శించుకున్నారు.

1 నుంచి టీటీడీ ఉద్యోగుల వార్షిక క్రీడలు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 26: టీటీడీ ఉద్యోగుల వార్షిక క్రీడలు మార్చి ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 18వ తేదీ వరకు జరగనున్న ఈ క్రీడల్లో ప్రాతినిథ్యం వహించే ఉద్యోగులు నెలాఖరు లోపు పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. విజేతలకు మొదటి బహుమతిగా రూ.2 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.1,800, తృతీయ బహుమతి రూ.1,600అందజేస్తారు. ఆసక్తిగల ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీటీడీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కిరణ్ సోమవారం ప్రకటనలో కోరారు.

రమణ దీక్షితులు తొలగింపుపై హర్షం

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 26: టీటీడీ యాజమాన్యం, అర్చకులు, జియ్యంగార్లపై తీవ్రమైన వ్యాఖ్యలు చేసిన టీటీడీ గౌరవ ప్రధాన అర్చకుడు రమణ దీక్షితులను తొలగిస్తూ పాలకమండలి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని టీటీడీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చీర్లకిరణ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. టీటీడీ ఆయనకు కల్పించిన సదుపాయాలనూ స్వాధీన పరుచుకోవాలని కోరారు.

'అభినయ్‌ను విమర్శిస్తే తిరుపతిలో తిరగలేరు'

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 26: వైసీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి భూమన అభినయ్‌రెడ్డిని విమర్శిస్తే తిరుపతిలో ఉండలేరని వైసీపీ యువజన విభాగం నాయకుడు సురేష్ హెచ్చరించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ అభినయ్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక జనసేన నిరాధారమైన ఆరోపణలు చేయడాన్ని తప్పుబట్టారు. సాక్ష్యాలుంటే బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. అభినయ్ తప్పు చేసినట్లు తేలితే శిరచ్ఛేదనం చేసుకుంటానని సవాల్ విసిరారు. ఇకమీదట ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, అభినయ్‌రెడ్డిలను విమర్శిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. తమ నాయకుడు ఆజ్ఞాపిస్తే తిరుపతిలో తిరగలేరని వార్నింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రజాగ్రహం

● కలెక్టరేట్ వద్ద ప్రజా సంఘాల ఆందోళన
● సమ్మె నోటీసు ఇచ్చిన ఉపాధి హామీ ఉద్యోగులు
● కలెక్టరేట్‌లో స్పందనకు 151 అర్జీలు


స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో పెంచలకిశోర్


జేసీకి సమ్మె నోటీసు ఇస్తున్న ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 26: సమస్యలు పరిష్కరించకపోవడంపై ప్రజా సంఘాల నేతలు, ఉద్యోగులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. అధికారులకు వినతులు సమర్పించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందనకు 155 వినతులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా 122 రెవెన్యూ సమస్యలపై ఉన్నాయి. డీఆర్వో పెంచలకిషోర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మురళి, దేవేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, కోదండరామిరెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

హామీ తప్పా వేతనం ఎక్కడ పెంచారు..?

హామీ ఇచ్చారే గాని వేతనం పెంచలేదని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విద్యాలయంలో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. వర్సిటీ పరిధిలోని రీసర్చ్ స్టేషన్లలో పనిచేస్తున్న కాంట్రాక్టు వర్కర్లకు టైంపే స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా నాయకులు జయచంద్ర, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.సాయిలక్ష్మి, ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నబాబు, ఒప్పంద కార్మికుల యూనియన్ నాయకులు వరలక్ష్మి, చంద్రమ్మ, సుబ్బు, మునిలక్ష్మి, రాధ, రేవతి, గిరి, నాగరాజు, నవీన్, చక్రి, మురళి, రత్నమ్మ, లావణ్య, గుర్రప్ప, రాధిక, జయంతి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు కేటాయించండి

పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. రెండు సెంట్లు భూమి కేటాయించాలని ఐదేళ్లుగా అడుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. హామీలు తప్ప ఆచరణ లేదని మండిపడ్డారు.

ఉపాధి హామీ ఉద్యోగుల సమ్మె నోటీసు

తమ సమస్యలను పరిష్కరించకపోవడాన్ని నిరసిస్తూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ఉద్యోగులు సోమవారం జేసీ శుభం బన్సల్‌కు సమ్మె నోటీసు అందజేశారు. టెక్నికల్ అసిస్టెంట్స్, కంప్యూటర్ ఆపరేటర్లకు గ్రేడ్స్ నిర్ణయించడంలో ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. వారికి పదోన్నతి కల్పించి, పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లీలావతి, జయంతి తదితరులు పాల్గొన్నారు.




ధర్నా చేస్తున్న సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నేతలు - ఆందోళన చేస్తున్న అగ్రి కల్చరల్ కళాశాల ఒప్పంద కార్మికులు

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 26 : ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 26నుంచి మార్చి చివరి వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 27న తిరుపతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో వ్యాసరచన, 28న పిచ్చాటూరులో క్విజ్, 29న పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్థిక అక్షరాస్యతపై కాంపిటేషన్ నిర్వహించనున్నట్లు వివరించారు. గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్‌తో పాటు ప్రైజ్ మనీ అందజేయనున్నట్లు తెలిపారు. లీడ్ బ్యాంకు మేనేజరు సుభాష్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులు మందలించారని..

● ఇంటి నుంచి వచ్చేసిన విద్యార్థులు ● తిరిగి అప్పగించిన తిరుమల పోలీసులు


తిరుమల పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులు

తిరుమల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని తల్లిదండ్రులు మందలించడంతో ఇద్దరు విద్యార్థులు ఇంటి నుంచి తిరుమలకు వచ్చారు. వారిని తిరుమల టూటౌన్ పోలీసులు గుర్తించి తిరిగి తల్లిదండ్రులకు అప్పగించారు. తిరుమల టూటౌన్ సీఐ సత్యనారాయణ వివరాల మేరకు.. తిరుమలలోని ఏఎన్సీ ప్రాంతంలో సోమవారం ఉదయం అనుమానితంగా తిరుగుతున్న ఇద్దరు విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. తమ పేర్లు నారాయణ, మణి అని, మార్కులు తక్కువ వచ్చాయని తల్లిదండ్రులు తిట్టడంతో నల్గొండ నుంచి తిరుమలకు వచ్చామని వివరించారు. దీంతో పోలీసులు వారి తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

నీటి సమస్యను పరిష్కరిస్తాం


ఆత్మీయ సమావేశంలో జన సైనికులు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 26: నీటి సమస్యను తప్పక పరిష్కరిస్తామని జనసేన పట్టణాధ్యక్షుడు రాజారెడ్డి స్థానికులకు హామీ ఇచ్చారు. సోమవారం సాయంత్రం 47వ డివిజన్ ఎర్రమిట్ట ప్రాంతంలో జనసేన ఆధ్వర్యంలో స్థానికులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నీటి సమస్య తీవ్రంగా ఉందని ప్రజలు వారి దృష్టికి తెచ్చారు. రోడ్లు, పారిశుధ్యం సరిగా లేవని తెలిపారు. స్పందించిన రాజారెడ్డి మాట్లాడుతూ టీడీపీ, జనసేన సంయుక్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలను పరిపూర్ణంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పథకాలను నమ్మి మోసపోవద్దని సూచించారు.

డాక్టరేట్ ప్రదానం


అరుణకుమారి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 26: పద్మావతి వర్సిటీ ఫార్మసీ స్కాలర్ ఆర్.అరుణకుమారి డాక్టరేట్ పొందారు. స్టడీస్ అన్ డెవలప్‌మెంట్ ఆఫ్ బ్రెయిన్ టార్గెటెడ్ డ్రగ్ డెలివరి సిస్టమ్స్ ఆఫ్ సెలెక్టెడ్ సీఎన్ఎస్ డ్రగ్స్ అంశంపై ప్రొఫెసర్ ఇందిరముజీబ్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్టు వర్సిటీ పీఆర్వో శ్రీరజని తెలిపారు.

ఘనంగా ఎన్ఎస్ఎఫ్ 13వ వార్షికోత్సవం



మాట్లాడుతున్న నగేష్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 26 : నవ సమాజ ఫెడరేషన్ (ఎన్ఎస్ఎఫ్) 13వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎఫ్ వ్యవస్థాపకులు నీరుగట్టు నగేష్, మహిళా ప్రతినిధి నందిని, పద్మావతి కాలేజీ ప్రిన్సిపాల్ నారాయణమ్మ, పద్మావతి వర్సిటీ ప్రొఫెసర్ మమత, కస్తూర్బా గాంధీ ట్రస్ట్ నిర్వాహకులు పిసి రాయల్, చదలవాడ సుచరిత తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ తరం యువత సామాజిక బాధ్యతను పెంచుకోవాలన్నారు. ఎన్ఎస్ఎఫ్ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఈ సంస్థ తిరుపతిలో మంచి గుర్తింపు పొందిందన్నారు. అనంతరం పలు రంగాల్లో సేవలందించిన ప్రొఫెసర్ బీవీ మురళీధర్, నర్సింగ్ కాలేజీ నిర్వాహకుడు ప్రవీణ్, విశ్వం విశ్వనాథరెడ్డి, నలంద స్కూల్ నిర్వాహకుడు ఓబులరెడ్డి, డాక్టర్ రెడ్డెప్ప తదితరులకు అవార్డులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ, రమేష్, కిరణ్, నాగార్జున పాల్గొన్నారు.

రోగులకు నిస్వార్థంగా వైద్య సేవలందించాలి

● పీజీ బాలుర వసతిగృహ నూతన భవనం ప్రారంభం


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డి

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 26 : వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని, అలాంటి వృత్తిలో రాణిస్తున్న వైద్య విద్యార్థులు రోగులకు నిస్వార్థంగా వైద్య సేవలు అందించాలని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి పేర్కొన్నారు. ఎస్వీ వైద్య కళాశాలలోని పీజీ వైద్య విద్యార్థుల కోసం రూ. 16.75 కోట్లతో ప్రసూతి ప్రభుత్వ ఆస్పత్రి ముందు నూతనంగా నిర్మించిన వసతిగృహ భవనాన్ని ఆయన సోమవారం ఎంపీ గురుమూర్తి, మేయర్ డాక్టర్ శిరీషతో కలిసి ప్రారంభించారు. ముందుగా శిలా ఫలకాన్ని ఆవిష్కరించి, అనంతరం వసతిగృహాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైద్య విద్యను అభ్యసిస్తూ రోగులకు వైద్యం అందించే 200 మంది పీజీ వైద్య విద్యార్థుల కోసం అధునాతన వసతులతో భవనం అందుబాటులోకి రావడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్లు రవిప్రభు, పార్థసారథిరెడ్డి, వైద్య విభాగాధిపతులు సుబ్బారావు, కిరీటి, శ్రీకాంత్ రెడ్డి, ఏపీఎంఐడీసీ ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ లక్ష్మీపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్సులు లేక ప్రయాణికుల అవస్థలు



బాలాయపల్లి మండలంలో ఆటోలో వెళుతున్న విద్యార్థులు

గూడూరు, ఫిబ్రవరి 26: సీఎం జగన్ ఎక్కడ బహిరంగ సభ జరిగినా ప్రయాణికులకు అవస్థలు తప్పడంలేదు. సభ జరిగే ప్రాంతంతో పాటు పక్క జిల్లాల్లోని ఆర్టీసీ డిపోల నుంచి కూడా అత్యధిక బస్సులన్నీ జనాన్ని తరలించడానికి మళ్లిస్తున్నారు. ఈనెల 18వ తేదీన అనంతరపురం జిల్లా రాప్తాడులో జరిగిన సిద్ధం సభకు గూడూరు డిపో నుంచి 30 బస్సులను తరలించారు. అప్పుడు మూడు రోజులపాటు ప్రయాణికులు అవస్థలు పడాల్సి వచ్చింది. సోమవారం కుప్పంలో సీఎం పర్యటనకు ఆదివారం ఉదయమే గూడూరు డిపో నుంచి 20 బస్సులను జనసమీకరణకు తరలించారు. ప్రయాణికులకు తగినన్ని బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు ముహూర్తాలు ఉండడంతో గూడూరు నుంచి నెల్లూరు, తిరుపతి, ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు బస్సుల కోసం ఎదురుచూడాల్సి వచ్చింది. వచ్చిన బస్సుల్లోనే రద్దీ కారణంగా నిలబడి ప్రయాణాలు సాగించాల్సి వచ్చిందని ప్రయాణకులు ఆవేదన వ్యక్తం చేశారు.

బాలాయపల్లి: బాలాయపల్లి మండలంలో ప్రయాణికులతో పాటు విద్యార్థులు ఇబ్బందులు పడాల్సివచ్చింది. బాలాయపల్లి మండలంలోని వెంకటరెడ్డిపల్లి, గూడూరు మండలం గొల్లపల్లి, నెన్నూరు, కొమ్మనేటూరు, తిరువెంగళామపల్లి, చెమిర్తి, తిప్పవరపాడు గ్రామాల నుంచి విద్యార్థులు బస్సుల్లో బాలాయపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు వచ్చి వెళ్తుంటారు. సోమవారం ఆర్టీసీ బస్సులను కుప్పంలో సీఎం సభకు మళ్లించడంతో వెంకటగిరి - గూడూరు మార్గంలో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడ్డారు. పాఠశాలకు వెళ్లేందుకు, తిరిగి ఇంటికి చేరుకునేందుకు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



మృతిచెందిన అఫ్జల్

గూడూరు, ఫిబ్రవరి 26: విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలైన ఘటన గూడూరు పట్టణంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.... స్థానిక మసీదువీధిలో కాపురం ఉంటున్న అఫ్జల్(52), అల్లాబక్షు పెయింట్ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. సోమవారం సనత్‌నగర్‌లో ఓ ఇంటికి రంగులు వేస్తుండగా సమీపంలోని 11కేవీ విద్యుత్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యారు. వెంటనే ఏరియా ఆస్పత్రికి తరలించగా అఫ్జల్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. అల్లాబక్షును మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఒకటో పట్టణ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వరద బాధితులకు పరిహారమేదీ?

- స్వర్ణముఖి వరదతో పంటలన్నీ నీటిపాలు
- ఇసుక మేటలతో నిండిన పొలాలు
- మూడు నెలలైనా అందని పరిహారం



వరద ఉధృతికి ఇసుక మేటలతో నిండి వరి పొలం

వాకాడు, ఫిబ్రవరి 26: వరద ముంచేసి.. మూడు నెలలు కావస్తోంది.. రబీ సీజన్ ముగింపు దశకు వచ్చేసింది. పంట పొలాలు స్వర్ణముఖి ఉగ్రరూపానికి కోతకు గురై ఇసుక మేటలుగా మారాయి. ఇప్పటికీ బాధితులకు నష్టపరిహారం అందకపోవడంతో రైతులకు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వాకాడు మండలంలో మొలగనూరు, వాకాడు, కొండాపురం, తిరుమూరు, ముట్టెంబాక, కోడివాక తదితర గ్రామాల్లో 62 హెక్టార్లల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అయితే కేవలం రూ.11.17 లక్షలు మాత్రమే పంటనష్టం జరిగినట్లు నివేదిక పంపారు. నిజానికి రైతులకు జరిగిన నష్టం కోట్లలో ఉంది. వరద ముంపునకు గురైన పొలాన్నీ ఇసుక మేటలుగా మారడంతో వాటిని చదునుచేసి పంటలు వేయాలి. అయితే మూడు నెలలుగా ఎదురుచూస్తున్నా ఎరిహారం అందకపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరద నష్టం పరిశీలనకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్ త్వరలోనే నష్ట పరిహారం అందుతుందని రైతులకు భరోసా ఇచ్చారు. మూడు నెలలు కావస్తున్నా పైసా ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పరిహారం త్వరగా అందేలా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కోట పట్టణాన్ని మున్సిపాలిటీ చేస్తాం: పాశిం



సునీల్‌కు హారతి పడుతున్న మహిళలు

కోట, ఫిబ్రవరి 26: కోట పట్టణాన్ని అధునాతన వసతులతో మున్సిపాలిటీగా మార్చుతామని గూడూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ హామీ ఇచ్చారు. సోమవారం పట్టణంలోని బజారుసెంటర్‌లో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మహిళలు భారీగా తరలివచ్చి సునీల్‌కుమార్‌కు కర్పూర హారతులు ఇచ్చారు. అక్కడ నుంచి బజారు మెయిన్ సెంటర్, ఆర్టీసీ సెంటర్లల్లో గల దుకాణాలు, ఇంటింటా తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి సైకిల్ గుర్తుపై ఓటువేసి తనను అత్యధిక మేజార్టీతో గెలిపించాలని కోరారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కోట పట్టణాన్ని రూ.12 కోట్లతో అభివృద్ధి చేశామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, పలగాటి భాస్కర్‌రెడ్డి, తీగల సురేష్‌బాబు, మధుయాదవ్, దారా సురేష్, షంషుద్దీన్, నౌషాద్, మర్రి పోలయ్య, అనిల్, మస్తాన్‌బాషా, రాధాకృష్ణారెడ్డి, వాకా విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీపై నమ్మకంతోనే పార్టీలో చేరికలు

గూడూరు, ఫిబ్రవరి 26: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజలు నమ్మి పార్టీలో చేరుతున్నారని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక అశోక్‌నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే నివాసం వద్ద గాంధీనగర్‌కు చెందిన పలువురు టీడీపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దోచుకోవడం పనిగా పాలన సాగిస్తోందన్నారు. అవినీతిని ప్రశ్నించేవారిపై దాడులకు దిగుతూ అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో వాటంబేడు శివకుమార్, పెంచలయ్య, ఉదయ్, కృష్ణయ్య, రమేష్‌రెడ్డి, బాబు, కృష్ణ, గోవిందయ్య, వెంకటేశ్వర్లు, రవి, వెంకయ్య, మల్లి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి, అరాచక ప్రభుత్వాన్ని గద్దె దింపండి

వెంకటగిరి, ఫిబ్రవరి 26: పట్టణ పరిధిలోని 4వ వార్డు సాలికాలనీలో బాబు ష్యూరిటీ - భవిషత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అవినీతి, అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించి టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, పునుగోటి విశ్వనాథనాయుడు, శ్రీరామదాసు గంగాధర్, అవ్వారు సత్యనారాయణ, సుదా, మల్లారం బాబు తదితరులు పాల్గొన్నారు.

బాబుతోనే యువతకు బంగారు భవిత: కురుగొండ్ల



సమావేశంలో మాట్లాడుతున్న కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, ఫిబ్రవరి 26: చంద్రబాబుతోనే యువతకు బంగారు భవిత సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. తెలుగు యువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మై ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్ కార్యక్రమంపై సోమవారం తన నివాసంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత టీడీపీ హయాంలో చంద్రబాబు పేద విద్యార్థుల విదేశీ విద్యకు ఆర్థిక సాయం అందించే పథకాన్ని అమలు చేస్తే, జగన్ అధికారంలోకి రాగానే నీరుగార్చారని విమర్శించారు. ఐటీ మంత్రిగా నారా లోకేశ్ రాష్ట్రంలో అనేక పరిశ్రమలను తీసుకువచ్చి యువత ఉపాధి కల్పించారని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం కొత్త పరిశ్రమలను తీసుకురాక పోగా ఉన్న వాటినీ తరిమేసిందని ఆరోపించారు. తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 7903 మంది యువతీ, యువకులకు కొత్తగా ఓటు హక్కు లభించిందన్నారు. ప్రతి ఒక్కరూ టీడీపీని గెలిపించి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, పునుగోటి విశ్వనాధ నాయుడు, హేమంత్ చౌదరి, సుకుమార్, నానీ, చంటీ, బాషా, రవి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 26: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన నాయుడుపేట పట్టణంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.... పెళ్లకూరు మండలం చావాలి గ్రామానికి చెందిన రమేష్(35) నాయుడుపేటలో నివాసం ఉంటూ కూలి పనులు చేసుకుంటున్నాడు. ఇటీవల కుటుంబ కలహాల కారణంగా భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో రమేష్ మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం శ్రీరామకాలనీ మెయిన్ వీధి వద్ద రమేష్ పడిపోయి ఉండటంతో గమనించిన స్థానికులు 108కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకుని రమేష్‌ను నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

పాత ఇనుప సామాన్ల దుకాణం దగ్ధం

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 26: నాయుడుపేటలోని ఎల్‌ఐసీ కార్యాలయం సమీపంలో ఉన్న పాత ఇనుప సామాన్ల దుకాణం దగ్ధమైంది. బాధితుల కథనం మేరకు... పట్టణానికి చెందిన ఎండీ ఫరూక్ కొంత కాలంగా పాత సామాన్ల దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లాగు. అర్ధరాత్రి దుకాణంలో మంటలు చెలరేగడంతో స్థానికులు గుర్తించి అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

వాకాడు, ఫిబ్రవరి 26: మండలంలోని స్త్రీశక్తి భవనంలో సోమవారం అంగన్వాడీ, వైద్య సిబ్బందికి బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో మునికుమారి మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రోత్సహించేవారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బాల్య వివాహాలను అరికట్టడంలో ఆయా గ్రామాల్లోని సచివాలయాల పరిధిలో మహిళా పోలీసులు, పంచాయతీ సెక్రటరీలు, ఏఎన్ఎంలు, ఐసీడీఎస్ సిబ్బంది భాగస్వామ్యం అవుతూ బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాల గురించి టోల్‌ఫ్రీ నెంబరు 1098కు ఫోన్‌చేసి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలిరెడ్డిపాళెం ప్రభుత్వాస్పత్రి వైద్యులు దీప్తి, కమలశ్రీ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి సర్వే చేయించండి: షాలినీ రత్నం



మీడియాతో మాట్లాడుతున్న షాలినీ రత్నం

నాయుడుపేట, ఫిబ్రవరి 26: టికెట్ల కేటాయింపు కోసం మరోసారి సర్వే చేయించాలని టీడీపీ అధినేత చంద్రబాబుకు మాజీ మంత్రి పరసా వెంకటరత్నం కుమార్తె షాలినీ రత్నం విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆమె తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. 30 ఏళ్లుగా టీడీపీ కోసం తమ కుటుంబం ఎంతో కష్టపతోందని, 2009 నుంచి ప్రతి ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పనిచేశామని గుర్తుచేశారు. టీడీపీ నిర్వహించిన సర్వేలో తమ పేర్లను పరిశీలించలేదని, పైగా పార్టీ కోసం ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించని మహిళకు టికెట్ కేటాయించడం తమను బాధించిందన్నారు. అధిష్ఠానం మరోసారి సర్వే నిర్వహిస్తే ఎవరికి ప్రజాభిమానం ఉందో బయటపడుతుందని షాలినీ రత్నం అన్నారు.

మిగులు భూములను పేదలకు పంపిణీ చేయాలి

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 26: మండల పరిధిలోని పెట్లూరులోని సర్వే నెంబరు 1లో 238, 12-1లో 519 ఎకరాల మిగులు భూములను పేదలకు పంపిణీ చేయాలని సీపీఎం వెంకటగిరి ఏరియా ఆర్గనైజర్ వడ్డిపల్లి చెంగయ్య అన్నారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా గిరిజనులు భూములను సాగు చేస్తుంటే అటవీశాఖ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇదే సర్వే నెంబరులో అనేక మంది భూస్వాములకు పట్టాలు ఇచ్చినా పట్టించుకోలేదని చెప్పారు. పేదలకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పద్మమ్మ, గోపాల్, రమణయ్య, లోకనాథం, సుబ్బు, రామయ్య, రేణుక పాల్గొన్నారు.

మున్సిపాలిటీ మార్కెట్ వేలం

నాయుడుపేట, ఫిబ్రవరి 26: మున్సిపాలిటీ పరిధిలోని కూరగాయాల మార్కెట్, తోపుడు బండ్లు, గంపలు, మూటలు, ప్రైవేట్ బస్సులు, లారీల నుంచి రుసుము వసూలు చేసుకునేందుకు సోమవారం కమిషనర్ జనార్దనరెడ్డి ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. కూరగాయాల మార్కెట్ రుసుం వసూలు హక్కులను ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి రూ.12.57 లక్షలకు, తోపుడుబండ్లు, గంపలు, మూటలకు రుసుం వసూలు హక్కులను ఎస్.చిట్టిబాబు రూ.2.47 లక్షలకు, బస్టాండ్ వద్ద ప్రైవేట్ బస్సులు, లారీలు నిలుపుదల రుసుం వసూలు హక్కులను జి.కళ్యాణి 1.58 లక్షలకు వేలం పాటలో పాడుకున్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

గూడూరు, ఫిబ్రవరి 26: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఆవరణలో సోమవారం గూడూరు మండలంలోని పొదుపు మహిళలకు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా చెక్కులను ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌రావు పంపిణీ చేశారు. అదేవిధంగా మండలంలోని వలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్‌కుమార్, ఎంపీడీవో రామచంద్ర, పొణకా దేవసేనమ్మ, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, చేవూరు విజయ్‌మోహన్‌రెడ్డి, బాబురెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

త్రిలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు

గూడూరు, ఫిబ్రవరి 26: మండలంలోని మేగనూరు గ్రామంలో ఉన్న త్రిలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ శివలింగప్రతిష్ఠ, కలిశస్థాపన, హోమపూజలు, కుంభాబిషేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌రావు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గొర్ల రమేష్, కృష్ణయ్య, తిరుపాలయ్య, శ్రీనివాసులు, రమణయ్య ఉన్నారు.

రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డికి సన్మానం



వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని సన్మానిస్తున్న విజయశ్రీ

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 26: రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ సన్మానించారు. సోమవారం నెల్లూరులోని ఆయన స్వగృహంలో వేమిరెడ్డిని కలిసి శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నెలవల సుబ్రహ్మణ్యం, నెలవల రాజేష్, పార్థసారధి ఉన్నారు.

సీఎం జగన్‌వన్నీ ఉత్తుత్తి హామీలే: టీడీపీ



కరపత్రాలను పంపిణీ చేస్తున్న పాశిం సంధ్యారాణి

గూడూరు, ఫిబ్రవరి 26: అధికారంలోకి రావడం కోసం జగన్ ఉత్తుత్తి హామీలు ఇచ్చారని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. సోమవారం స్థానిక 14వ వార్డులో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యపానం నిషేధం అమలు చేస్తామని మాట చెప్పి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నాశికరం బ్రాండ్ల అమ్మకాలతో కోట్ల రూపాయలు దోచుకుంటోందని ఆరోపించారు. నాశిరకం మద్యం తాగిన పేదలు ఆస్పత్రులు పాలై ఆర్థికంగా చితికిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు.

మహిళలకు సీఎం జగన్ క్షమాపణ చెప్పాలి: భాను



పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 26: రాష్ట్రంలోని మహిళలకు సీఎం జగన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సంపూర్ణ మద్యపాన నిషేధం చేసిన తరువాతే మళ్లీ ఓట్లు అడిగేందుకు వస్తానని గత ఎన్నికల ప్రచారం సందర్భంగా వాగ్దానం చేసి ఆ హామీ తుంగలో తొక్కినందుకు జగన్ గుంజీళ్లు తీసి మహిళలను క్షమాపణ అడిగిన తరువాతే ప్రజల్లోకి రావాలని స్పష్టం చేశారు. తన బినామీల ద్వారా నాసిరకం మద్యం తయారు చేయించి వాటిని సర్కారీ మద్యం దుకాణాల ద్వారా విక్రయించి ఈ ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు పైగా దోచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాసిరకం మద్యం కారణంగా రాష్ట్రంలో సుమారు 30 వేల మంది ప్రాణాలు పోగొట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యం, వారి ప్రాణాలపైన వ్యాపారం చేసే దుర్మార్గపు ప్రభుత్వం ప్రపంచంలోనే వేరే ఎక్కడా ఉండదన్నారు. వైసీపీ పాలనలో తీసుకువచ్చిన మద్యం పాలసీపైన, మద్యం నాణ్యతపైన సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. యావత్ ఆంధ్రప్రదేశ్‌ను మోసం చేసిన జగన్‌కు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు.

భాను ఎంపికపై హర్షం



భానుప్రకాష్‌ను కలిసిన తెలుగు యువత

తిరుపతి (కొర్లగుంట), ఫిబ్రవరి 26: టీడీపీ నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా గాలి భానుప్రకాష్ ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ తిరుపతి యువనేత శంకర్‌యాదవ్ తన అనుచరులతో సోమవారం శ్రీనివాసపురంలోని నివాసంలో గాలి భానుప్రకాష్‌ను మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలియజేశారు. నగరి నియోజకవర్గంలోని మెజారిటీ యాదవులు అండగా ఉంటామన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, ఆయన్ను సీఎం చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై ఉండాలని భాను పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నేతలు హరిబాబు, గణేష్, సాయి, ప్రవీణ్, శీను, రాము, నగరి నియోజకవర్గ నేత సోము పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 26: ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 26నుంచి మార్చి చివరి వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 27న తిరుపతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో వ్యాసరచన, 28న పిచ్చాటూరులో క్విజ్, 29న పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్థిక అక్షరాస్యతపై కాంపిటేషన్ నిర్వహించనున్నట్లు వివరించారు.

పుత్తూరు వార్తలు

రైల్వే అండర్ బ్రిడ్జిల ప్రారంభం

పుత్తూరు, ఫిబ్రవరి 26: పుత్తూరు రైల్వే స్టేషన్ పరిధిలోని నిర్మించిన నాలుగు అండర్ బ్రిడ్జిలను సోమవారం ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో ఢిల్లీ నుంచి ప్రారంభించారు. నందిమంగళం, రాచపాలెం, శిరుగురాజుపాలెం, తడుకు వద్ద అండర్ బ్రిడ్జిల వద్ద జరిగిన కార్యక్రమాల్లో స్థానిక రైల్వే అధికారులు, వైసీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో ఒత్తిడి దూరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో ప్రభాకర్‌రాజు

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 26: ఫిజియోథెరపీతో ఒత్తిడి దూరమవుతుందని ఎంఈవోలు ప్రభాకర్‌రాజు, బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. పుత్తూరు మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం నిజాం వైద్యశాల ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఉద్యోగపరంగా ఎదరువుతున్న ఒత్తిళ్లు జయించాలంటే ఫిజియోథెరపీ అవసరమని అన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఆస్పత్రి సిబ్బంది రమేష్, మహేష్ ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.5.09 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.5.09 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 76,577 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 23,656 మంది తలనీలాలు సమర్పించారు.

రమణ దీక్షితులు తొలగింపుపై హర్షం

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 26: టీటీడీ యాజమాన్యం, అర్చకులు, జియ్యంగార్లపై తీవ్రమైన వ్యాఖ్యలు చేసిన టీటీడీ గౌరవ ప్రధాన అర్చకుడు రమణ దీక్షితులను తొలగిస్తూ పాలకమండలి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని టీటీడీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చీర్లకిరణ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

సర్కారు వారి పాట... అస్మదీయులకు పెద్దపీట

- మున్సిపాలిటీ వేలంపాట నిబంధనల్లో మార్పు
- బయానా సొమ్ము డబుల్
- పైగా ముందురోజే చెల్లించాలనే షరతు
- అధికార పార్టీ కాంట్రాక్టర్ల కోసం పాట్లు



పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 26: అస్మదీయులకు వేలంపాటను కట్టబెట్టేందుకు మున్సిపాలిటీ పడరానిపాట్లు పడుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా అధిక ధర రావాలంటే పోటీ ఎక్కువగా ఉండాలి. అందుకే వీలైనంత ఎక్కువ మంది వేలం పాటలో పాల్గొనేలా నిబంధనలు రూపొందిస్తారు. అయితే పుత్తూరు మున్సిపల్ అధికారులు ఆదాయం సంగతి అటుంచి అధికార పార్టీకి చెందిన కాంట్రాక్టర్లకు మేలు చేకూర్చేందుకు ప్రాధాన్యమిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వేలంపాటను ఈనెల 28వ తేది బుధవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రూ.5 లక్షల నుంచి పది లక్షలకు పెంపు

పట్టణ పరిధిలో దినసరి కూరగాయల మార్కెట్, జంతువధశాల, ప్రైవేట్ బస్టాండ్‌ల నుంచి గుత్త వసూలుకు మున్సిపాలిటీ ఏటా వేలం నిర్వహిస్తుంది. ఆసక్తి ఉన్న కాంట్రాక్టర్లు బయానా పేరుతో కొంత మొత్తం నగదును ముందస్తుగా చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన మొత్తానికి ఏదైనా స్థిర ఆస్తికి సంబంధించి సాల్వెన్సీ సర్టిఫికెట్, ఈసీ సమర్పిస్తారు. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు... ఈ ఏడాది అధికార పార్టీకి చెందిన కాంట్రాక్టర్లకు వేలంపాటలో పోటీ లేకుండా ఏకపక్షంగా దక్కించుకునేందుకు తీవ్ర కసరత్తే చేశారు. ఇందుకుగాను నిబంధనలను అడ్డుపెట్టుకున్నారు. గత ఏడాది దినసరి కూరగాయల మార్కెట్‌కు రూ.5 లక్షలుగా ఉన్న బయానాను ఈ ఏడాదికి రూ.పది లక్షలకు పెంచారు. అలాగే ప్రైవేట్ బస్టాండ్‌కు రూ.3 లక్షలుగా ఉన్న బయానాను రూ. 6 లక్షలకు (వందశాతం), జంతువధశాలకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు(50 శాతం) పెంచారు. బయానా శాతం పెంచే అధికారం మున్సిపాలిటీకి ఉంటుంది. గతంలో కూడా 10నుంచి 30 శాతం వరకు పెంచిన ఉందతాలు ఉన్నాయి. అయితే ఏకంగా డబుల్ చేయడంపై సర్వత్రా విమర్శలు చెలరేగుతున్నాయి. వేలంపాటలో పాల్గొనే వారి సంఖ్య తగ్గించడం, అస్మదీయ కాంట్రాక్టర్లకు పోటీలేకుండా చేసే ప్రయత్నంలో భాగంగానే బయానా మొత్తాన్ని పెంచారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పాటు బయానా నగదు, సాల్వెన్సీ సర్టిఫికెట్‌ను సైతం ముందురోజే మున్సిపాలిటీకి అందిచాలనే షరతును తెరపైకి తెచ్చారు. దీనివల్ల వేలంలో పాల్గొనే వారి వివరాలు ముందురోజే తెలిసిపోవడంతో సామ ధాన బేధ దండోపాయాలను ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నారనే మాటలు వినబడుతున్నాయి.

స్పందనలో ఫిర్యాదు

మున్సిపాలిటీ నిబంధనలను మార్చేసి అధికారపార్టీ కాంట్రాక్టర్లకు కొమ్ముకాస్తుండడంపై సమాచార హక్కుల వేదిక కార్యదర్శి మురగారెడ్డి తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో ఫిర్యాదు చేశారు. వేలంలో అధిక సంఖ్యలో కాంట్రాక్టర్లు పాల్గొనే విధంగా మునుపు ఉన్న నిబంధనలనే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మునివేలమ్మ

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 26: మండలంలోని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ మునివేలమ్మ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశంను ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రసాదరావు మాట్లాడుతూ ఎన్నికల కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే జగనన్న ఇళ్ల పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. రామసముద్రం సర్పంచు మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ తీగలు కిందనే వేలాడుతున్నాయని, వాటి వల్ల ప్రమాదాలు జరిగే అవకాశముందని చెప్పగా, విద్యుత్ ఏఈ స్పందిస్తూ కిందకు వేలాడుతున్న విద్యుత్ లైన్లను మరమ్మతులు చేస్తామని చెప్పారు. అలాగే జగనన్న కాలనీలో నూతన విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఎంఈవో బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎస్ఎస్‌సీ పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. వ్యవసాయాధికారి కోదండయ్య మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ పథకాలు పొందాలంటే ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు మునస్వామిరెడ్డి, విమల్మ, సూపరిటెండెంట్ వాణి, ఈవోఆర్‌డీ శ్రీనివాసులు, ఉద్యానవనశాఖ ఏవో సౌజన్య, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

మృత్యుంజయ స్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మృత్యుంజయ స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల నుంచి సంకల్పం స్వీకరించారు. వివిధ పూజా ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా అభిషేకించారు. వేదమంత్రాలతో ధూపదీప నైవేద్యాలు సమర్పిం చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆకట్టుకున్న గుర్రపు స్వారీ



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26: గుర్రపు స్వారీ దృశ్యం ప్రజలను ఆకట్టుకుంది. రెండు రోజుల క్రితం ఏర్పేడు ఐఐటీలో ఎన్‌సీసీ బృందం ఆధ్వర్యంలో గుర్రపు స్వారీ ప్రదర్శన జరిగింది. అదే బృందం సోమవారం శ్రీకాళ హస్తి వీధుల్లో సాగింది. ఎన్‌సీసీ బృందం గుర్రాలను తోలుతూ పట్టణ ప్రధాన వీధుల మీదుగా ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల వద్దకు చేరుకున్నారు. వీక్షకులు గుర్రపు స్వారీని ఆసక్తిగా తిలకించారు.

టీడీపీ సీనియర్ నాయకుడికి ఘన నివాళి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26: శ్రీకాళహస్తి కొండమెంటుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు తులసి కుమార్‌కు అనారోగ్యంతో సోమవారం ఇంటి వద్ద మృతిచెందారు. బొజ్జల బృందమ్మ ఆయన మృతదేహానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ పట్టణ అధ్యక్షులు విజయకుమార్, తెలుగు యువత పట్టణ అధ్యక్షులు కిట్టు ఉన్నారు.

రావణాసుర వాహనం వితరణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26: ముక్కంటి ఉత్సవ మూర్తిని ఊరేగించే దారువు రావణబ్రహ్మ వాహనాన్ని ఇద్దరు భక్తులు సంయుక్తంగా వితరణ చేశారు. శ్రీకాళహస్తి మండలం ఊరందురు గ్రామానికి చెందిన ధర్మయ్య, హైదరాబాద్‌కు చెందిన జ్యోతి సంయుక్తంగా ముక్కంటి ఆలయానికి సోమవారం రావణాసుర వాహనాన్ని అందజేశారు. ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు వాహనాన్ని అందుకుని దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

ముక్కంటి సేవలో అమృతానంద స్వామి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26: తిరుపతి రామకృష్ణ మఠం పీఠాధిపతి అమృతానంద స్వామి మరికొందరు స్వాములు, శిష్య బృందంతో కలిసి సోమవారం ముక్కంటి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు వారికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. గురు దక్షిణామూర్తి సన్నిధిలో శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంతరూపానంద స్వామి, బర్గేశానంద స్వామి, శిశు బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితేనే లక్ష్యం చేరుకుంటాం

సత్యవేడు, ఫిబ్రవరి 26: విద్యార్థులు ఇష్టపడి చదివితేనే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలుగుతారని సత్యవేడు సీఐ దివాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక దాస్ డిగ్రీ కళాశాలలో కళాశాల 14వ వార్షికోత్సవ వేడుకలు కరస్పాండెంట్ పరంధామ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో అవరచుకునే క్రమశిక్షణ, పట్టుదల ఉన్నత శిఖరాలకు బాటలు వేస్తాయన్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో రవి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జగన్మోహన్ ఆచారి, ఎంఈవో-2 ఉష పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

ఏర్పేడు, ఫిబ్రవరి 26: అధికారులు ప్రజా సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ ఉదయ్ భాస్కర్‌రాజు సూచించారు. ఏర్పేడు మండల సమావేశం ఎంపీపీ గీత ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ఇందులో ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. మరమ్మతులకు గురైన తాగునీటి బోర్లను బాగుచేయించాలని సూచించారు. కాగా కోబాక సర్పంచ్ బుజ్జమ్మ తరఫున ఆమె కుమారుడు చెంగల్ రాయులు, ఎండీపుత్తూరు సర్పంచ్ మోహనప్రియ బదులు ఆమె భర్త మహేష్‌రెడ్డి, అముదూరు సర్పంచ్ లక్ష్మమ్మ తరఫున ఆమె కుమారుడు పెరుమాల్ హాజరు కావడం గమనార్హం. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గీత, వైస్ ఎంపీపీలు శ్రీనివాసులుయాదవ్, జనార్ధన్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ జీతాలివ్వాలి



వరదయ్యపాళెంలో నిరసన తెలుపుతున్న కార్మికులు తదితరులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 26: మండలంలో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ పంచాయతీ కార్మికులకు పెడింగ్ జీతాలు ఇవ్వాలని ఏఐటీయూసీ సత్యవేడు నియోజకవర్గ గౌరవాధ్య క్షులు చిన్నిరాజ్ కోరారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిషత్ కార్యాల యం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాం తాలలో పారిశుధ్య కార్మికులకు 24 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ప్రస్తుతానికి కనీసం పది నెలలు జీతాలైనా ఇవ్వాలన్నారు. గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలన్నారు. అనంతరం ఏఓ త్రివిక్రమ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అన్నాదొరై, చంద్రబాబు, గంగయ్య, రాజా పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: వరదయ్యపాళెంలోనూ స్వచ్ఛభారత్ కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. మాస్కులు, బ్లౌజులు, శానిటైజర్లు, యూనిఫాం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సత్యవేడు నియోజకవర్గ గౌరవాధ్యక్షులు చిన్నిరాజ్, స్వచ్ఛ భారత్ కార్మికుల సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు అన్నాదురై, నాయకులు చంద్ర, రవి, శివ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయండి

నాగలాపురం, ఫిబ్రవరి 26: మార్చి 3వ తేదీ నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాగలాపురం ఎంపీడీవో పీఎంకే బాబు కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలతో ఆయన మాట్లాడారు. ఏఎన్ఎంలు, డ్వాక్రా సభ్యులు, అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి విజయకుమార్ పాల్గొన్నారు.

● పదవులు భార్యలవి.. పెత్తనం భర్తలది

ఈ సమావేశం స్టేజిపైన ప్రొటోకాల్ ప్రకారం ఎంపీడీవోతో పాటు ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచ్ కూర్చోవాలి. అయితే వారి బదులు వారి భర్తలు శ్యామ్, మహేష్‌రెడ్డి, చిన్నదురైలు కూర్చోవడం గమనార్హం.

ఆక్రమణదారుల నుంచి ఇంటి స్థలాలు కాపాడండి



వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

శ్రీకాళ హస్తి, ఫిబ్ర వరి 26: రాజీవ్ నగర్‌లో ఆక్రమణ దారుల నుంచి తమ ఇళ్ల స్థలాలు కాపా డాలని గిరిజనులు విజ్ఞప్తి చేశారు. సీపీఐ శ్రీకాళహస్తి పట్టణ కార్యదర్శి గోపి ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దారు జనార్ధనరాజుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈశ్వరయ్య కాలనీకి చెందిన తమకు గతంలో ప్రభుత్వం రాజీవ్ నగర్‌లో ఇళ్ల స్థలాలు కేటాయించిందన్నారు. ఆర్థిక స్థోమత లేకపోవడంతో అక్కడ ఇళ్లు నిర్మించుకోలేక పోయామన్నారు. ప్రస్తుతం కైలాసగిరి కాలనీకి చెందిన అధికార పార్టీ నేత తమ స్థలాలను దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. ఆయన పేదల స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేయడంతో పాటు ఇతరులకు విక్రయిస్తున్నారన్నారు. అధికారులు జోక్యం చేసుకుని గిరిజనులైన తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పక్కా అప్రూవల్ తోనే నిర్మాణం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26: పక్కా రెండు అంతస్తులకు అప్రూవల్ తోనే కళ్యాణ మండపం నిర్మాణం చేసినట్లు రెడ్డివారి బత్తిరెడ్డి తెలిపారు. 'నిర్మాణ నిబంధనలకు పాతర' అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతిలో సోమవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద ఒక్క స్లాబ్ అనుమతితో రెండు స్లాబుల కళ్యాణ మండపం నిర్మించినట్లు ప్రస్తావించిన అంశాన్ని యజమాని రెడ్డి వారి బత్తిరెడ్డి ఖండించారు. తాను పక్కాగా రెండు స్లాబులకు అనుమతి తీసుకోవడమే కాకుండా పార్కింగ్, అగ్నిమాపక నిబంధనలు పాటించానని వివరించారు.

అనారోగ్యంతో ముసలిపేడు ఎంపీటీసీ మృతి

ఏర్పేడు, ఫిబ్రవరి 26: ఏర్పేడు మండలం ముసలిపేడు ఎంపీటీసీ తుపాకుల రమణమ్మ(45) సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆర్టీఐ ప్రశ్నలకు సమాధానం ఏదీ..?

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 26: ఇందిరానగర్ పంచాయతీకి చెందిన అడిపూడి ఆషా ఆర్టీఐ ద్వారా అడిగిన 15 ప్రశ్నలకు ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది సమాధానం ఇచ్చారు. మిగిలిన 13 ప్రశ్నలకు నెలలు గడుస్తున్నా సమాధానం లేదు. గత నెల 25న డీఎల్‌పీవో కార్యాలయంలో రికార్డులు ఉన్నాయని తెలిపారు. తిరిగి సోమవారం ఆషాను అప్పీలకు పిలిచి మరో రెండు వారాలు వ్యవధి కావాలని అధికారులు కోరారు. ఇదిలా ఉండగా తప్పులు కప్పిపుచ్చుకేనేందుకే ఇలా కాలయాపన చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఎంపీడీవో సుబ్రహ్మణ్యంరాజు, ఏవో అనసూయ, ఎస్‌ఏ మురళీకృష్ణ, డీపీఆర్వో చిరంజీవి, జూనియర్ అసిస్టెంట్ భాగ్యరేఖ, కార్యదర్శులు హబీబ్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

అమృత పథకంతో
శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్‌కు మహర్దశ



అమృత పథకం ప్రారంభోత్సవంలో కోలా ఆనంద్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26: శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్‌కు అమృత పథకంతో మహర్దశ పట్టనుందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా అమృత పథకాన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. ఇందులో శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్ కూడా అమృత పథకానికి ఎంపికైంది. ఈ సందర్భంగా ప్రధాని వర్చువల్ ప్రారంభోత్సవాన్ని బీజేపీ నాయకులు వీక్షించారు. అంతకుముందు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చంద్రప్ప, నియోజకవర్గ కో కన్వీనర్ మేళాగారం సుబ్రహ్మణ్యం రెడ్డి, స్టేషన్ మాస్టర్ మన్మోహన్ పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు విచ్చేయండి



సీఎం జగన్‌కి చిత్రపటం బహూకరిస్తున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26: ముక్కంటి ఆలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలని సీఎం జగన్‌ను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు, ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి కోరారు. ఆహ్వానపత్రికతోపాటు స్వామి అమ్మవార్ల కలంకారీ చిత్రపటాన్ని బహూక రించారు. అదేవిధంగా ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు టీటీడీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి, ఎస్పీ మలికా గార్గ్ తదితరులను కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు.

'టీడీపీ టిక్కెట్టు నాకు కేటాయించండి'



మాట్లాడుతున్న పేరం నాగరాజు నాయుడు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26: శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే టిక్కెట్టు తనకు కేటాయించాలని తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు పేరం నాగరాజు నాయుడు కోరారు. తాను ఎన్టీరామారావుకు వీరాభిమానినని టీడీపీ అభివృద్ధికి ఎంతో కృషి చేశానని తన సేవలకు ఇప్పటివరకు టీడీపీ ఎలాంటి పదవులను కేటాయించ లేదన్నారు. తన అన్న పేరం హరిబాబు, తన తాత సుబ్బరామ నాయుడులు అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డిపై పోటీ చేశారని రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన తనకు అవకాశం ఇవ్వాలని లేనిపక్షంలో సుధీర్‌రెడ్డిని ఓడిస్తామని చెప్పారు.

స్నేహపూర్వకంగా మెలగాలి

కేవీబీపురం, ఫిబ్రవరి26: స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో పోలీసులు స్నేహ పూర్వకంగా మెలగాలని పుత్తూరు ట్రైనీ డీఎస్పీ సింధుప్రియ చెప్పారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కేసులు పెండింగ్‌లు లేకుండా చూడాలని ఎస్ఐ సునీల్, ఏఎస్ఐ లోకనాథానికి సూచనలు చేశారు.

క్యూలైన్ల పరిశీలన

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26: మార్చి 3 తేదీ నుంచి జరగబోయే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఏర్పాటు చేయబోయే క్యూలైన్లను వన్‌టౌన్ సీఐ నరసింహారావు పరిశీలించారు. సోమవారం సాయంత్రం ఆయన ఇంజనీరింగ్ అధికారులతో కలిసి భక్తులు వెళ్లే మార్గం, వచ్చే మార్గాలను పరిశీలించారు. తగు సూచనలు చేశారు.

ముఖ్యమంత్రికి స్వాగతం, వీడ్కోలు



సీఎంకు స్వాగతం పలుకుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రేణిగుంట, ఫిబ్రవరి26: చిత్తూరు జిల్లా కుప్పం పర్యటనలో భాగంగా సోమవారం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఘనస్వాగతం, సాదర వీడ్కోలు లభించింది. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో సీఎం సోమవారం ఉదయం 10.02 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. ఆయనతోపాటు మంత్రి అంబటి రాంబాబు వచ్చారు. వారికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అనంతపురం జిల్లా కలెక్టర్ గౌతమి, ఎస్పీ మలిక గర్గ్, జేసీ శుభంబన్సల్, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ కళ్యాణ చక్రవర్తి, ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదనరెడ్డి, తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, తహసీల్దార్ నాగేశ్వర్‌రావులు పుష్పగుచ్చాలు అందజేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం సీఎం 10.18 గంటలకు కుప్పానికి హెలికాప్టర్‌లో బయలుదేరారు. ఆయనతోపాటు మంత్రి పెద్దిరెడ్డి సైతం హెలికాప్టర్‌లో వెళ్లారు.

సాదరవీడ్కోలు:

కుప్పం పర్యటన ముగించుకొని తిరిగి సాయంత్రం 3.52 గంటలకు విమానాశ్రయం చేరుకున్నారు. స్వాగతం పలికిన వారితోపాటు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, శ్రీకాళహస్తీశ్వర ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈఓ నాగేశ్వర్‌రావు, ఆర్డీవో రవిశంకర్‌రెడ్డిలు సాదర వీడ్కోలు పలికారు.

నిబద్ధతతో పనిచేయాలి : ఎస్పీ



పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పీ మలిక గర్గ్

రేణిగుంట, ఫిబ్రవరి26: రానున్న సార్వత్రిక ఎన్నికల నిబద్ధతతో పనిచేయాలని పోలీసు అధికారులను ఎస్పీ మలిక గర్గ్ ఆదేశించారు. రేణిగుంట విమానాశ్రయం పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో సోమవారం రేణిగుంట పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని అధికారులతో నేరాల నివారణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. రౌడీషీటర్లు, పాతనేరస్తులను వెంటనే బైండోవర్ చేసుకొని వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్లు ప్రతిగ్రామంలో ప్రజలతో సమావేశాలు నిర్వహించి, చిన్న చిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తే ప్రజల్లో పోలీస్ మార్క్ కనపడుతుందన్నారు. మాదకద్రవ్యాల అమ్మకం, రవాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైల్వేస్టేషన్లు, ప్రధానరహదారుల్లోని కూడళ్లలో నిరంతర తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. జాతీయరహదారుల నిర్మాణపనులు జరుగుతున్న కారణంగా రోడ్డుప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఐఐటీ, ఐసర్, భారీపరిశ్రమలు, పారిశ్రామిక వాడల్లో శాంతి భద్రతలు పరిరక్షించడానికి రాత్రి సమయాల్లో పోలీస్ బీట్లు పెంచాలన్నారు. రేణిగుంట విమానాశ్రాయానికి రాకపోకలు నిర్వహించే ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కింది స్థాయి సిబ్బంది పనితీరు పట్ల అధికారులు నిఘా ఉంచాలని తెలయజేశారు. ఈ సమావేశంలో డీఎస్పీలు భవ్యకిషోర్, భాస్కర్‌రెడ్డి, సీఐలు, ఎస్ఐలు పోలీసులు పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ ఏమైంది: టీడీపీ



ఓటు హక్కుపొందిన విద్యార్థులతో రవినాయుడు

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 26: ప్రతి సంవత్సరం జనవరిలో జాబ్ క్యాలెండరు ప్రకటిస్తామన్న సీఎం జగన్ ప్రకటన ఏమైందని టీడీపీ యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన వరదయ్య పాళెంలోని షిర్డిసాయి డిగ్రీ కళాశాలలో తొలిసారి ఓటు హక్కు పొందిన యువతతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో విద్యకు ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. 22లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న సీఎం హామీ నీటిమూటలైందన్నారు. కనీసం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి, నూతన పరిశ్ర మలను తీసుకురావడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆదరిస్తే యువతకు పెద్దపీట వేసి ఉద్యోగ కల్పనకు కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కృష్ణయాదవ్, హేమంత్, లక్ష్మీపతిరాజు, నూతలపాటి హరిప్రసాద్ చౌదరి, ఎన్టీఆర్ అంకయ్య, మనోహర్‌నాయుడు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు అండగా ఉంటా: సుధీర్‌రెడ్డి



గిరిజనులతో బొజ్జల కుటుంబం

తొట్టంబేడు, ఫిబ్రవరి 26: వచ్చే ఎన్నికల్లో తనను ఆదరించాలని గిరిజనులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొజ్జల సుధీర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఊరందూరులోని ఆయన స్వగృహంలో గిరిజనులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో సుధీర్‌రెడ్డి మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం 90శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేసి గిరిజనుల అభివృద్ధికి తోడ్పడిందన్నారు. వైసీపీ గిరిజనులపై దౌర్జన్యాలకు దిగిందన్నారు. అరాచకం పోవాలంటే టీడీపీ గెలవాలని కోరారు. కాగా ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలోనే ముక్కంటి ఆలయంలో అవినీతి, అక్రమాలు జరుగుతు న్నాయని ఆరోపించారు. దేవస్థానం అధికారులు, పాలకమండలి సభ్యులు ఎమెల్యే చేతిలో కీలుబొమ్మలుగా మారారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ ఎస్టీసెల్ అధ్యక్షుడు సుబ్రమణ్యం, ఎంపీపీ నాగరాణి, సింగమాల సర్పంచ్ మాధవి, వెంగ్రిచెంగయ్య పాల్గొన్నారు.

ఆగమోక్తంగా మహానంది ప్రారంభం



త్రయంబకేశ్వరాలయం వద్ద ఏర్పాటు చేసిన మహానంది ప్రతిమ

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 26: వరదయ్యపాళెం మండలంలోని జ్ఞానప్రసూనాంబ సమేత త్రయంబకేశ్వర స్వామి ఆలయం ఎదుట నిర్మించిన మహానందిని సోమవారం ఆగమోక్తంగా ప్రారంభించారు. ముందుగా ఆలయంలో గణపతి పూజ చేశారు. హోమపూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో మొక్కులు చెల్లించుకున్నారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల బొప్పన మోహన మురళి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని రైతు కూలీ మృతి



రాఘవయ్య (ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26: తొట్టంబేడు మండలం చిన్న సింగమాల వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాఘవయ్య అనే రైతు కూలీ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. సింగమాల దళితవాడకు చెందిన రాఘవయ్య (44) రైతు కూలీ. సమీపంలో పొలాల్లో పనులకు వెళ్లి మధ్యాహ్నం సింగమాల రోడ్డు పక్కన చెట్టు వద్ద నిద్రిస్తుండగా ప్రైవేటు స్కూల్ బస్సు అదుపుతప్పి రాఘవయ్యను ఢీకొంది. ఆ సమయంలో బస్సులో చిన్నారులు కూడా ఉన్నారు. స్థానికులు బస్సును తప్పించి రాఘవయ్యను ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బస్సులో విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ పరారయ్యాడు. శ్రీకాళహస్తి టు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా రాఘవయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకులు తెలిపారు. పట్టణంలోని కుందేటి వారి వీధిలో బీజేపీ అభివృద్ధి కార్యక్రమాలపై సోమవారం ఇంటింటా ప్రచారం చేశారు. వచ్చే ఎన్నికల్లో శ్రీకాళహస్తి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోలా ఆనంద్‌ను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గరికిపాటి రమేష్ బాబు, అమర్నాథ్ డిల్లీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



చికిత్సపొందుతున్న గిరి

తొట్టంబేడు, ఫిబ్రవరి 26: ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. దీంతో ద్విచక్ర వాహన దారుడికి తీవ్రగాయాల య్యాయి. స్థానికుల కథనం మేరకు.. కేవీబీపురం మండలం పవన వారి కండ్రిగకు చెందిన గిరి పుంగనూరులోని అత్తగారింటికి వెళ్లాడు. 8నెలల గర్భిణి అయిన భార్యను చూసి తిరిగి ద్విచక్రవాహనంలో స్వగ్రామం వస్తుండగా శ్రీకాళహస్తి మండలంలోని రామపురం వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి కిందపడి గాయాలపాలయ్యాడు. స్థానికులు 108లో ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో రుయాకు తరలించారు.

శ్రీసిటీలో 'సింగపూర్' అధికారులు



శ్రీసిటీ, ఫిబ్రవరి 26: సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ పరిధిలోని ఎంటర్‌ప్రైజ్ సింగపూర్(ఈఎస్‌జీ) ఏజెన్సీకి చెందిన తొమ్మిది మంది సీనియర్ అధికారుల బృందం సోమవారం శ్రీసిటీని సందర్శించింది. శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్(మార్కెటింగ్)శివశంకర్ వారికి సాదర స్వాగతం పలికి పారిశ్రామిక నగరం ప్రత్యేకతలను వివరించారు. శ్రీసిటీ వాతావరణం తమను ఎంతగానో ఆకట్టుకుందంటూ బృందంలో ఒకరైన ఎలీన్ లీ తెలిపారు. ఇక్కడ పరిశ్రమల స్థాపనకు పలు సింగపూర్ కంపెనీలు మొగ్గు చూపుతాయన్న విశ్వాసాన్ని ఆమె వ్యక్తం చేశారు. ఈ పర్యటనపై శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్పందిస్తూ.. ఈఎస్‌జీ సీనియర్ అధికారులు శ్రీసిటీని సందర్శించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ తరహా పర్యటనలు సింగపూర్, భారత్‌ల మధ్య వ్యాపార సంబంధాలను మరింత మెరుగుపరస్తాయన్నారు. కాగా, సింగపూర్‌కు చెందిన చిన్న మధ్య తరహా, భారీ సంస్థల వ్యాపార వృద్ధికి ఎంటర్‌ప్రైజ్ సింగపూర్(ఈఎస్‌జీ) ఉపయోగపడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా 35 చోట్ల, భారతదేశంలో డిల్లీ, ముంబై, చెన్నైలో దీని కార్యాలయాలున్నాయి.

టీడీపీని గెలిపించండి

తొట్టంబేడు: టీడీపీని గెలిపించాలని ఆ పార్టీ నాయకురాలు బొజ్జల రిషితారెడ్డి మండలంలోని పిల్లమేడు, దైనేడు గ్రామాలలో సోమవారం ప్రచారం చేశారు. రాష్ట్ర కార్యదర్శి చలపతినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు మురళినాయుడు, మునిరాజనాయుడు, వెంకటాచలం, జడ్పీటీసీ అర్చనాదేవి, పలువురు నాయకులు పాల్గొన్నారు.